ANN తెలుగు

Follow: @ANNTELUGU

28-10-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 261 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఓట్ బచావో.. దేశ్ బచావో

- ఆదిలాబాద్ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు మరియప్పన్ పిలుపు
- ఓటు రాజ్యాంగ హక్కు కాపాడుకోవడం మన బాధ్యత
- కంది మౌనా శ్రీనివాసరెడ్డి పిలుపు

07

టాప్ న్యూస్

మా వాళ్లపై చెయ్యి వేస్తే...

## నాపై వేసినట్టే

- షర్ట్ మడతపెట్టా... ఎవడొస్తాడో రండి.. చూసుకుందాం
- వైఎస్ జగన్ సవాల్
- ఎంత మంది వస్తారో రమ్మని సవాల్



02

## 'మీరు 2.0 చూపిస్తే.. మేం 10X చూపిస్తాం'

- జగన్‌కు పవన్ కళ్యాణ్ స్ట్రాంగ్ కౌంటర్
- జగన్ జనజీవనస్రవంతిలోకి రావాలని పిలుపు



02

365 మండలాల్లో

## కరువు

- ప్రకటించిన ప్రభుత్వం
- నేడు అఖిలపక్ష భేటీ



02

## గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో పెరిగే అవకాశం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి ఎల్లుండి దిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సీఈవోలు, ప్రతినిధులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, మన విజయాలను అతిథులకు చాటిచెప్పేలా హైదరాబాద్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై రేవంత్ రెడ్డి సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలపై, రక్షా ఎక్స్ పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలని, క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు సంబంధించిన ప్రముఖులను ఆహ్వానించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో డిజైన్లు ఉండాలని, కాకతీయ కళా తోరణం, రామప్ప ఆలయం డిజైన్లకు ప్రాముఖ్యతను ఇవ్వాలని స్పష్టం చేశారు. బతుకమ్మ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేక డిజైన్లు, ఏర్పాట్లు చేశామని అధికారులు సీఎం వివరించారు.

## అన్నాడీఎంకేలోకి ధనుష్ ?

**ఆ పార్టీ క్యాడర్ ను ఓన్ చేసుకునే వ్యూహం**






# గ్రేటర్ పై సీఎం నజర్

మూడు కార్పొరేషన్లపై గ్రౌండ్ సర్వేలు

- జీహెచ్ఎంసీ, సైబరాబాద్ లో సానుకూలం
- మల్కాజ్ గిరిలో హోరాహోరీ
- సీఎం చేతికి సర్వే రిపోర్ట్
- హైడ్రాతో సోషల్ మీడియాలో నెగిటివిటీ.. గ్రౌండ్ లో పాజిటివిటీ
- కొత్త ప్రతిపాదనలపై ప్రజల్లో ఆశలు

**(హైదరాబాద్ మహా):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రేటర్ cపై ఫోకస్ పెట్టారు. జీహెచ్ఎంసీ గడువు ఇప్పటికే ముగియగా, ఎన్నికలు నిర్వహించాలనుకుంటే ఈ డిసెంబర్, జనవరే సరైన సమయమని అంతకుమించి ఆలస్యమైతే ఈ టర్మ్ లో ఎలాగోలా ఎన్నికలు జరగకుండా ప్రణాళిక రూపొందించాల్సిందేనన్న సూచనలు సీఎంకు అందినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో విపక్ష బీఆర్ఎస్ సోషల్ మీడియా ఎలాంటి ప్రచారాలు చేసినా, గ్రౌండ్ లో మాత్రం గతం కంటే కాంగ్రెస్ గణనీయంగా మెరుగుపడ్డట్లు తాజా సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. సిటీలో కాంగ్రెస్ మెరుగుపడడానికి అనేక కారణాలున్నాయి. హైడ్రా, ఈగల్, మహాలక్ష్మి, సన్నబియ్యం వంటి కార్యక్రమాలు ఇందులో కొంత కారణం కాగా, నాయకత్వమార్పుతో గతం కన్నా సిటీలోని పలు డివిజన్లలో అవినీతి తగ్గింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిని విస్తరించి, పలు మునిసిపాలిటీలు, కార్పోరేషన్లను విలీనం చేసి.. ముందు జీహెచ్ఎంసిని ఒకే కార్పోరేషన్ చేసిన సీఎం తర్వాత మూడు విభాగాలుగా విభజించారు.

**మూడింటిపై కన్ను**

గ్రేటర్ హైదరాబాద్ లో జీహెచ్ఎంసి ప్రధాన కార్పోరేషన్ గా ఉండగా, ఇక్కడ కాంగ్రెస్ , ఎంఐఎం కలిసి ఈజీగా కార్పోరేషన్ ను కైవసం చేసుకుంటాయని, 150 డివిజన్లలో 120కు పైగా స్థానాలు ఈ రెండుపార్టీలకే వచ్చే అవకాశముందని సీఎంకు నివేదిక అందినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లిహిల్స్ బైపోల్ రెండూ జరగ్గా, రెండింటిలోనూ కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో



# తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

- కేటీఆర్, హరీశ్‌రావు భ్రమల్లో ఉన్నారు.
- సంక్షేమ పథకాలే మా బలం.
- నవంబర్ తర్వాత ఎన్నికలపైనే పూర్తి దృష్టి.
- బీజేపీకి రెండంటే రెండే.
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో వచ్చే ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు పదును పెడుతోందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వంద స్థానాలు సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన రాష్ట్ర రాజకీయాలపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలంగా ఉందని, ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వచ్చేది తమ పార్టీయేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శల వర్షం.**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంకా రాజకీయ భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు సరిగ్గా గుర్తించడం లేదని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రజల మధ్య తమ పార్టీకి ఉన్న ఆదరణను అంచనా వేయడంలో ప్రతిపక్ష నేతలు పూర్తిగా విఫలమవుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై చురుగ్గా పనిచేస్తున్నారని, పార్టీ శ్రేణులతోనూ చక్కటి సమన్వయం కొనసాగుతోందని పేర్కొన్నారు.

**నవంబర్ తర్వాత ఎన్నికలే లక్ష్యం.**

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వివిధ సమస్యలకు నవంబర్ నాటికి పూర్తి పరిష్కారాలు లభిస్తాయని మహేశ్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ నెల తర్వాత నేరుగా ఎన్నికల ప్రక్రియపైనే పూర్తి దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. పార్టీ వ్యవహారాల్లో ముఖ్యమంత్రి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, కాంగ్రెస్ నాయకుల మధ్య ఉన్న సమన్వయం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

**కేసీఆర్ అప్పులు.. కాంగ్రెస్ సంక్షేమమే అస్త్రం.**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మేధావిగా భావిస్తామని, అయితే ఆయన ఎలాంటి దీర్ఘకాలిక ఆలోచన లేకుండా రాష్ట్రాన్ని భారీ అప్పుల్లో నెట్టేశారని మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలే తమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక సుమారు 90 వేల ఉద్యోగాలు కల్పించామని, ఆ యువతంతా కాంగ్రెస్ వెంటే ఉంటారని చెప్పారు.

**బీజేపీపై తీవ్ర విమర్శలు.**

తెలంగాణలో సమీప భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేనేలేదని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న ఎనిమిది మంది ఎంపీల్లో రాబోయే ఎన్నికల్లో కనీసం ఇద్దరు గెలిచినా ఎక్కువేనని, అలాగే ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరూ గెలవరని ఎద్దేవా చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో తాము భారీగా స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఏదేమైనా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, రాబోయే ఎన్నికల్లో వంద సీట్ల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని ఆయన తేల్చిచెప్పారు.

## ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు కసరత్తు

- అధికారుల బదిలీలకు ఎన్నికల సంఘం ఆదేశం
- నవంబర్ 30లోగా ప్రక్రియ పూర్తి చేయాలి.

02



## గడ్డం కృష్ణమూర్తికి జీవన సాఫల్యపురస్కారం

**శ్రుతిలయ ఫౌండేషన్, సీల్ వెల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**హైదరాబాద్, మహా :** ఏఎన్ఎన్, మహాపత్రికల అసోసియేట్ ఎడిటర్ గడ్డం కృష్ణమూర్తికి భాషా సాంస్కృతిక శాఖ శ్రుతిలయ ఫౌండేషన్, సీల్ వెల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో అక్కినేని సీల్ వెల్ శ్రుతిలయ మీడియా జీవన సాఫల్యపురస్కారం లభించింది. రవీంద్రభారతిలో మాజీ ఆర్ టీఐ కమిషనర్ విజయబాబు, మాజీ కార్పోరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ గుప్తాలు ముఖ్య అతిథులుగా హాజరుకాగా, ఘనంగా సత్కరించి పురస్కారం అందజేశారు. అక్కినేని మీడియా పురస్కారం అందుకోవడంపై కృష్ణమూర్తి సంతోషం వ్యక్తం చేశారు. నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.



## పత్రికా స్వేచ్ఛకు అగ్నిపరీక్ష

- డేటాతో మీడియాకు సంకెళ్ళు
- డీపీడీపీ చట్టంపై సుప్రీంకు మీడియా
- కేంద్రానికి నోటీసు.. స్టేకు ససేమిరా
- పరిశోధనాత్మక జర్నలిజానికి ఉరితాడు: డీఎన్‌పీఏ
- జర్నలిజంపై టెక్ దిగ్గజాలను నియంత్రించే చట్టం
- నవంబరు 17న తదుపరి విచారణ

03

## ట్రంప్ మిడ్‌టర్మ్ పోరులో కొత్త మలుపు!

- భారతీయ అమెరికన్ ఓటర్లలో మారుతున్న రాజకీయ వైఖరి.
- వంబర్ 3న అమెరికా మధ్యంతర ఎన్నికలు. డెమోక్రాట్ల వైపు మొగ్గు చూపుతున్న ఓటర్లు

02







# కరువు ముప్పుపై ప్రభుత్వం అప్రమత్తం కావాలి.

**హైదరాబాద్,మహా :** రాష్ట్రంలో భూగర్భ జలాల క్షీణత, తీవ్రమైన సాగునీటి కొరత, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నెలకొన్న ఇబ్బందుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అప్రమత్తమై కరువు నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని జనసేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా కరువు ముప్పు పొంచి ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించేందుకు వెంటనే ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని నిర్వహించాలని కోరుతూ ఆయన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. రైతాంగం, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కుటుంబాల జీవనోపాధిని పరిరక్షించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.కరువు ముప్పుపై సమగ్ర అంచనా అవసరంరాష్ట్రంలో సుమారు 24 శాతం వర్షపాత లోటు నమోదైందని, 358 మండలాల్లో తీవ్ర కరువు ముప్పు ఉందని, దాదాపు 6 లక్షల బోర్లు ఎండిపోయినట్లు వస్తున్న సమాచారం అత్యంత ఆందోళనకరంగా ఉందని డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ గణాంకాలను సంబంధిత శాఖలు శాస్త్రీయంగా ధ్రువీకరించి, వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం వెంటనే ప్రజలకు వెల్లడించాలని కోరారు. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలు, పంటల సాగు విస్తీర్ణం, నీటి వనరుల లభ్యతపై జిల్లాల వారీగా క్షేత్రస్థాయి అంచనాలు నిర్వహించాలని సూచించారు.సాగు విరామంపై రైతులకు స్పష్టత ఇవ్వాలిప్రకృతి వైపరీత్యాలను మానవ ప్రమేయంతో పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి దుష్ప్రభావం రైతాంగంపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. రైతులు ఆరు నెలల పాటు పంటలు సాగు చేయవద్దని ముఖ్యమంత్రి సూచించినట్లు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో, ఆ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు పరిస్థితులను ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. పంటల సాగుకు విరామం అవసరమని భావిస్తే, ఆ కాలంలో రైతు కుటుంబాల జీవనోపాధి ఎలా కొనసాగుతుంది, వ్యవసాయ కూలీలకు ఉపాధి ఎలా కల్పిస్తారనే అంశాలపై ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని హితవు పలికారు. ఎలాంటి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపకుండా సాగుపై సూచనలు ఇవ్వడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు

# మా వాళ్లపై చెయ్యి వేస్తే... నాపై వేసినట్టే

- **షర్ట్ మడతపెట్టా... ఎవడొస్తాడో రండి.. చూసుకుందాం**
- **వైఎస్ జగన్ సవాల్**
- **పోలింగ్ రోజున పులివెందులలోనే ఉంటా**
- **ఎంత మంది వస్తారో రమ్మని సవాల్**

**పులివెందుల, మహా :** పులివెందులలో తమ వాళ్లపై చెయ్యి వేస్తే.. తనపై వేసినట్టే. షర్ట్ మడతపెట్టా.. ఇప్పుడు ఎవడొస్తాడో రండి చూసుకుందాం అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ హీట్ ని మరింత పెంచాయి. మంగళవారం పులివెందులలో కార్యకర్తల సమావేశంలో జగన్ మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున పులివెందులలోనే ఉంటానని.. ఎంత మంది వస్తారో రండి.. గట్టిగా తగులుదాం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు జగన్. ప్రజాస్వామ్యంలో ఎవరు మంచి చేశారో ప్రజలు వాళ్లకు మాత్రమే తోడుగా నిలబడతారని సంకేతం ఖచ్చితంగా పంపిస్తామని అన్నారు. కార్యకర్తల మీద పడ్డ దెబ్బను చూస్తూ ఊరుకోనని.. జగన్ 2.0లో జగన్ ఒకటైతే.. రెండోది కార్యకర్తేనని అన్నారు జగన్. కార్యకర్తలు తోడుగా నిలబడ్డారు కాబట్టే తాను సీఎం అయ్యానని.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు జగన్. మన హక్కులు మనమే కాపాడుకోవాలని.. తిరగబడాలని.. మీ అన్న మీకు తోడుగా ఉంటాడని అన్నారు జగన్. పులివెందులలో కొడితే.. చెంప గుయ్ మానాలని.. పులివెందుల సౌండ్ రాష్ట్రంలో మోగాలని అన్నారు జగన్. పోలీసులు డ్యూటీ చేస్తున్నది చంద్రబాబు కోసం కాదని... టోపీ మీద ఉన్న మూడు సింహాలను చూసి డ్యూటీ చేయాలని అన్నారు జగన్. ప్రజలకు రక్షకులుగా ఉండాల్సినవారే దౌర్జన్యం చేస్తే కాపాడేదెవరని ప్రశ్నించారు. అరెస్టులు చేసినా, కేసులు పెట్టినా భయపడేది లేదని అన్నారు జగన్.

# 'మీరు 2.O చూపిస్తే.. మేం 10X చూపిస్తాం'

- **జగన్‌కు పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ కౌంటర్**
- **జగన్ జనజీవనస్రవంతిలోకి రావాలని పిలుపు**

**అమరావతి, మహా :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సెటైర్ విసిరారు. మంగళవారం ఎన్డీఏ మీడియా సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. 'మీరు 2.O చూపిస్తే మేం 10 X చూపిస్తాం. మీరు ఇలా మాట్లాడితేనే 2019లో ప్రజలు గుణపాఠం చెప్పారు' అంటూ వ్యాఖ్యానించారు. జగన్ బెదిరిస్తే బెదిరిపోవడానికి ఇక్కడ ఎవరూ సిద్ధంగా లేరన్నారు. బలహీనులే ఇలా మాట్లాడుతారని.. బలవంతులు ఎవరూ కూడా ఇలా మాట్లాడరని అన్నారు. సీఎం చంద్రబాబు చెప్పినట్టు జగన్ జనజీవన స్రవంతికి రావాలని పిలుపునిచ్చారు. అప్పుడే ఆయనకు ప్రజల మనోభావాలు అర్ధమవుతాయని హితవుపలికారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిగానే ఉంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో సవాళ్లు వేరే విధంగా ఉంటాయని... స్థానిక సంస్థల ఎన్నికల్లో సవాళ్లు వేరే విధంగా ఉంటాయని చెప్పుకొచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కొన్ని స్థానాలకు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఇప్పుడు సీట్ల సర్దుబాటు ఎక్కువ స్థానాలకు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. క్లిష్టతరమైనా సరే... రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిగానే ఉంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాలు తమ ముందున్నాయన్నారు. ఈసారి స్థానిక సంస్థల్లో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ట్రంప్ మిడ్‌టర్మ్ పోరులో కొత్త మలుపు!

**వాషింగ్టన్,మహా :** అమెరికాలో నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో 'ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్' సంస్థ వెల్లడించిన తాజా సర్వే ఫలితాలు అమెరికా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. గత అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌కు ఓటు వేసిన దక్షిణాసియా అమెరికన్లలో ఏకంగా 25 శాతం మంది ఈసారి డెమొక్రటిక్ అభ్యర్థులకు మద్దతు ఇస్తామని స్పష్టం చేయడం ఈ సర్వేలో ప్రధానాంశంగా నిలిచింది. 800 మంది ఓటర్లతో సర్వే.. మారుతున్న సమీకరణాలు దక్షిణాసియా అమెరికన్ ఓటర్లలో వస్తున్న రాజకీయ అభిప్రాయాల మార్పును తెలుసుకునేందుకు నిర్వహించిన ఈ సర్వేలో 800 మంది నమోదిత ఓటర్లు పాల్గొన్నారు. వీరిలో 87 శాతం మంది భారతీయ అమెరికన్లు కాగా, మిగిలినవారు ఇతర దక్షిణాసియా నేపథ్యాలకు చెందినవారు ఉన్నారు. గత అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్‌కు ఓటు వేసిన వారిలో 96 శాతం మంది ఈసారి కూడా డెమొక్రటిక్ అభ్యర్థులకే మద్దతు ఇస్తామని వెల్లడించారు. అయితే, గతంలో ట్రంప్‌కు ఓటు వేసిన వారిలో 67 శాతం మంది రిపబ్లికన్ల వైపే నిలుస్తుండగా, పాతిక శాతం మంది మాత్రం ఈసారి డెమొక్రాట్లకు ఓటేస్తామని తెలపడం గమనార్హం. ధరల భారం.. ఆరోగ్య ఖర్చులపై తీవ్ర ఆందోళన సర్వేలో పాల్గొన్న ఓటర్లను అత్యధికంగా ప్రభావితం చేస్తున్న అంశాల్లో జీవన వ్యయం మొదటి స్థానంలో నిలిచింది. సుమారు 65 శాతం మంది పెరుగుతున్న జీవన వ్యయాన్ని ప్రధాన సమస్యగా పేర్కొనగా, 53 శాతం మంది వైద్య ఖర్చులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఉద్యోగాలు, వేతనాలను 33 శాతం మంది, విద్యకు సంబంధించిన అంశాలను 28 శాతం మంది ముఖ్యమైన సమస్యలుగా గుర్తించారు. ఈ గణాంకాలు ఆర్థిక అంశాలే ఓటర్ల రాజకీయ అభిప్రాయాలను మార్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని స్పష్టం చేస్తున్నాయి. వలస విధానాలు.. వివక్షపై చర్చ వలస విధానాలు, జాతి వివక్షకు సంబంధించిన అంశాలు కూడా దక్షిణాసియా అమెరికన్ సమాజంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా వలస కుటుంబాల భద్రత, ఉద్యోగ అవకాశాలు, సామాజిక సమానత్వం వంటి అంశాలు ఎన్నికల వేళ రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టెక్సాస్ సహా జార్జియా, పెన్సిల్వేనియా, మిషిగన్ వంటి కీలక రాష్ట్రాల్లో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతుండగా, దక్షిణాసియా ఓటర్ల ఈ వైఖరి కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. నవంబర్ 3న వెలువడే ఫలితాలు ట్రంప్ ప్రభుత్వ విధానాలకు ప్రజల మద్దతును ఏ మేరకు ప్రతిబింబిస్తాయో తేలనుంది.



# గ్రేటర్ పై సీఎం నజర్

(మొదటి పేజీ తరువాయి )

పార్టీ విజయం సాధించింది. అనేక ప్రాంతాల్లో లెక్కలు మార్చేసింది. ఇక సైబరాబాద్ లోనూ బలమై నాయకత్వం, హైడ్రా ఇంపాక్ట్ కాంగ్రెస్ బలాన్ని పెంచాయి. సైబరాబాద్ పరిధిలో శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో ఉండడం అడ్వాంటేజ్ కాగా, ట్రయాంగిల్ ఫైట్ లో కాంగ్రెస్ కు అడ్వాంటేజ్ ఉంటుందనినివేదిక అందినట్లు సమాచారం. మల్కాజ్ గిరిలోనూ పరిస్థితి హోరాహోరీగా ఉందని, కాంగ్రెస్ పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందన్న రిపోర్ట్ సీఎంకు అందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డిసెంబర్ లో గ్లోబల్ సమ్మిట్ ముగియగానే, జీహెచ్ఎంసీ నగారా మోగే అవకాశముందన్న చర్చ జరుగుతోంది. జీహెచ్ఎంసీ విజయం ద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు బాటలు వేసుకోవాలని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనగా ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయ వ్యూహాలు పన్నడంలో, ప్రత్యర్థులను బోల్తా కొట్టించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది విలక్షణ శైలి కాగా, మూడు కార్పోరేషన్లపై ప్రత్యర్థులను ఎలా ముగ్గులోకి దింపి బోల్తాకొట్టిస్తాడో చూడాల్సిఉంది.




# అన్నాడీఎంకేలోకి ధనుష్ ?

**ఆ పార్టీ క్యాడర్ ను ఓన్ చేసుకునే వ్యూహం**

చెన్నై, మహా : తమిళనాడులో విజయ్ ప్రభుత్వం కొలువుదిరిన తర్వాత మరో ప్రముఖ నటుడు ధనుశ్ రాజకీయ రంగ ప్రవేశంపై చర్చ జరుగుతోంది. సొంతంగా పార్టీ పెట్టే కంటే క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న అన్నాడీఎంకేలో చేరే అంశాన్ని ఆయన పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆ పార్టీ చీఫ్ పళనిస్వామి కూడా ధనుశ్‌ను పార్టీలోకి ఆహ్వానించేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. తమిళనాట అన్నాడీఎంకేలో అంతర్గత పోరు రోజురోజుకీ తీవ్రరూపం దాలుస్తోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నుంచి పార్టీ పగ్గాలను చేజిక్కించుకునేందుకు ఎస్పీ వేలుమణి., సీవీ షణ్ముగం వర్గం తీవ్ర వ్యూహాలు రచిస్తోంది. ఇందుకు ప్రతిచర్యగానే షణ్ముగం మద్దతుదారులు 100 మందిని పళనిస్వామి పార్టీ నుంచి తొలగించినట్లు తెలిసింది. ఈ సమస్యల కారణంగా కార్యకర్తలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయిన అన్నాడీఎంకేకు భవిష్యత్ ఉందా? అనే ప్రశ్న పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రముఖ నటుడు ధనుశ్‌ను పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా తిరిగి బలపడాలని పళనిస్వామి వ్యూహరచన చేస్తున్నారు. మరోవైపు ఈ ఏడాది జరిగిన అసెంబీ ఎన్నికల ఫలితాలతో రాజకీయాల్లోకి రావాలన్న కోరిక ధనుశ్ మదిలో బలపడింది. తన అభిమాన సంఘాన్ని సేవా సంఘంగా మార్చారు. జెండాలో కూడా మార్పులు చేశారు. అయితే విజయ్‌లా ధనుశ్‌కు మహిళలు, యువతలో పెద్దగా ఫాలోయింగ్ లేదు. సొంతంగా ఓటు బ్యాంకు సృష్టించుకోవటం ఆయనకు కష్టమేనని రాజకీయ నిపుణులు అంటున్నారు. అభిమాన సంఘాల నెట్‌వర్క్ కూడా అంత బలంగా లేదు. గతంలో రజినీకాంత్



రాజకీయాల్లోకి వస్తానని చెప్పి వెనక్కు తగ్గటానికి కారణం కూడా తమిళనాడు అంతటా పోలింగ్ కేంద్రం స్థాయి కమిటీలను ఏర్పాటు చేయలేకపోవడమే. అభిమాన సంఘాలను సేవా సంస్థలుగా మార్చినా తదుపరి ఎన్నికల వరకు దాన్ని బలంగా నడపటం, కావాల్సిన ఆర్థిక నేపథ్యం ధనుశ్ దగ్గర లేదు. ఈ బలహీనతను అధిగమించేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో బలమైన నిర్మాణం ఉన్న అన్నాడీఎంకేలో చేరి రాజకీయ భవిష్యత్‌కు పునాదివేసుకోవాలని ధనుశ్ యోచిస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**ధనుశ్ వెనుక కమలం**

సినీ నటుడు ధనుశ్‌ను అన్నాడీఎంకేలోకి తీసుకురావటానికి పళనిస్వామి పెద్ద ప్రణాళిక చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ప్రాథమిక చర్యలు కూడా పూర్తయినట్లు సమాచారం. పళనిసామి కుమారుడు మిథున్, నటుడు ధనుశ్ మధ్య ఇప్పటికే మూడు సార్లు ప్రాథమిక చర్చలు జరిగినట్లు అన్నాడీఎంకే సీనియర్ నేతలు వెల్లడించారు. ఇటీవల ధనుశ్ తమ పార్టీలోకి వస్తే స్వాగతిస్తామని మాజీమంత్రి రాజేంద్రబాలాజీ అన్నారు. అన్నాడీఎంకేలో ధనుశ్‌కు జాయింట్ జనరల్ సెక్రటరీ లేదా యువజన విభాగ కార్యదర్శి బాధ్యతలు అప్పగించే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. టీవీకేతో పోటీ పడేందుకు, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు ధనుశ్‌ను పళనిస్వామి అస్త్రంగా చేసుకోవాలని భావిస్తున్నారని తెలుస్తోంది. సామాజికవర్గాల పరంగానూ ధనుశ్‌కు ఉన్న మద్దతు అన్నాడీఎంకేకు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. అంతా అనుకున్నట్లు జరిగితే త్వరలోనే ధనుశ్‌ను అన్నాడీఎంకే కండువాతో చూడొచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం

రెండో పంట వేయొద్దని మంత్రి పొంగులేటి విజ్ఞప్తి.

**సంగారెడ్డి, మహా :** ప్రస్తుతం మునుపెన్నడూ లేనివిధంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మన దేశ రైతాంగం ఎంతో అనుభవజ్ఞులైనందున, రాబోయే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఎవరు కూడా రెండో పంటను వేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ లబ్ధి కోసం కాకుండా, ప్రతిపక్షాలు కూడా క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను అన్నదాతలకు అర్థమయ్యేలా చెబితే బాగుంటుందని హితవు పలికారు.

మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా పర్యటనకు వెళ్లిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జి. వివేక్ వెంకటస్వామి సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ (జడ్పీ) హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక సమావేశంలో మంత్రులతో పాటు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, స్థానిక ఎంపీ ఎం. రఘునందన్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**ధరణి బంగాళాఖాతంలోకి.. 'భూభారతి' ద్వారా శాశ్వత పరిష్కారం**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద 'ధరణి' పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సరికొత్త 'భూభారతి' విధానాన్ని తీసుకువచ్చామని ఆయన స్పష్టం చేశారు. దాదాపు 125 సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా పూర్తిస్థాయి భూ సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శాస్త్రీయంగా భూముల రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 380 గ్రామాల్లో భూ సర్వే పూర్తికాగా, ఆయా గ్రామాల్లోని రైతులకు కొత్త భూమి హక్కు పత్రాలను కూడా అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుతం మరో 900 గ్రామాల్లో భూ సర్వే తుది దశకు చేరుకుందని, రాబోయే ఏడాదిన్నర కాలంలో తెలంగాణ అంతటా ఈ సమగ్ర భూ సర్వే ప్రక్రియ పూర్తవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు ఎలాంటి న్యాయపరమైన వివాదాలు లేని నిర్దుష్టమైన భూములను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించారు. దేశంలోనే మొదటిసారిగా ప్రతి భూకమతానికి ప్రత్యేకంగా 'ఆధార్' లాంటి 'భూదార్' సంఖ్యను తీసుకురాబోతున్నామని వివరించారు.




**కేంద్ర నిధులు రావడం ఆలస్యం.. అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్తాం**

గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడంలో కొంత జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు. అయినప్పటికీ, కేంద్రం తాజాగా రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసిందని వెల్లడించారు. గత గులాబీ పార్టీ (బీఆర్ఎస్) హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లన్నీ కేవలం ప్రకటనలకే, ఫోటోలకే పరిమితమయ్యాయని విమర్శించారు. తమది పూర్తిగా ప్రజా సంక్షేమ ప్రభుత్వమని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి సంపూర్ణ రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చేశారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధుల సాధన కోసం బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని, అఖిలపక్ష ప్రతినిధి బృందంగా త్వరలోనే ఢిల్లీకి వెళ్లి కేంద్ర పెద్దలను కలుస్తామని, రాష్ట్ర హక్కుల సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామని పొంగులేటి స్పష్టం చేశారు.

# ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు కసరత్తు

**అధికారుల బదిలీలకు ఎన్నికల సంఘం ఆదేశం**

**నవంబర్ 30లోగా ప్రక్రియ పూర్తి చేయాలి.**

ఢిల్లీ, మహా. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం పరిపాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో ఎన్నికల విధులతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న అధికారుల బదిలీలు, కొత్త నియామకాలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత, నిష్పాక్షికతను కాపాడే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ప్రధాన ఎన్నికల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలను పంపించింది. ఒకే జిల్లాలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులు, సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్నికల సంబంధిత అధికారులను నిబంధనల ప్రకారం తక్షణమే బదిలీ చేయాలని తేల్చిచెప్పింది.

**మూడేళ్ల సర్వీసు నిబంధన అమలు**

గత నాలుగేళ్ల కాలంలో ఒకే జిల్లాలో మూడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన అధికారులు, అలాగే సొంత జిల్లాల్లో సేవలందిస్తున్న ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులందరినీ బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి 2027 మే 31 నాటికి మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకునే అధికారులకూ ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. ఎన్నికల నిర్వహణపై ఏ ఒక్క అధికారికీ అనవసరమైన లేదా అవాంఛిత ప్రభావం చూపే అవకాశం లేకుండా పారదర్శక వాతావరణం కల్పించడమే ఈ ముందస్తు చర్య ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది.

**నవంబర్ 30లోగా నివేదిక సమర్పణ**

అధికారుల బదిలీలు, కొత్త పోస్టింగ్‌లకు సంబంధించిన పూర్తి ప్రక్రియను రాబోయే నవంబర్ 30వ తేదీలోగా కచ్చితంగా పూర్తిచేయాలని ఎన్నికల సంఘం గడువు విధించింది. ఆయా బదిలీల అమలు వివరాలతో కూడిన సమగ్ర నివేదికను వెంటనే తమకు సమర్పించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు సంబంధిత శాఖల నుంచి పూర్తి వివరాలను సేకరించి నిబంధనల అమలును పకడ్బందీగా నిర్ధారించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల ప్రస్తుత శాసన సభల పదవీకాలాలు 2027 మార్చి నుంచి మే మధ్యలో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు పరిపాలనా ఏర్పాట్లను వేగవంతం చేసింది. అధికారుల బదిలీలతో పాటు ఓటర్ల జాబితాల సవరణ, స్వేచ్ఛాయుత మరియు నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని నియమ నిబంధనలను ఆయా రాష్ట్రాలు కచ్చితంగా పాటించాలని ఈసీ గట్టిగా హెచ్చరించింది.

# 365 మండలాల్లో కరువు

**హైదరాబాద్, మహా.** తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, ఎల్‌నినో ప్రభావంపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో రాష్ట్రంలోని వ్యవసాయ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లుగా ఉండగా, కేవలం 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 17 శాతం లోటు వర్షపాతం ఏర్పడి, సాగు విస్తీర్ణం తగ్గడం, జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటడం, పంటల దిగుబడిపై అనిశ్చితి నెలకొనడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. ఈ కరవు పరిస్థితుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులను అంచనా వేసిన ప్రభుత్వం, ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించి కరవు ప్రభావిత ప్రాంతాలను అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రంలోని 3`1 జిల్లాల పరిధిలోని మొత్తం 365 మండలాలను కరవు మండలాలుగా గుర్తించినట్లు వెల్లడించింది. వీటిలో 111 మండలాలను తీవ్ర కరవు ప్రాంతాలుగా, 254 మండలాలను మధ్యస్థ (మోస్తరు) కరవు ప్రాంతాలుగా వర్గీకరించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. పరిస్థితి మరింత దిగజారకముందే ప్రతి మండలానికి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని విపత్తు నిర్వహణ శాఖ యంత్రాంగాన్ని ఆదేశించింది. వర్షాభావం కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రత్యక్షంగా దెబ్బతింది. గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోగా, వరి తదితర పంటల సాగు గణనీయంగా పరిమితమైంది. సాగునీటి కొరత, వర్షాల లేమి కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపినప్పటికీ, అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోయే స్థితికి చేరడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు క్రమంగా తగ్గిపోతుండటం తాగు, సాగునీటి అవసరాలపై తీవ్ర నీడను ప్రసరిస్తోంది. నీటి నిల్వలు అడుగంటుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం, సాగునీటిని ఆచితూచి విడుదల చేయడం అధికారులకు సవాలుగా మారింది.



# ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి అక్టోబర్ 27 మహా న్యూస్ :** ఏఐసీసీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధ్యక్షతన భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్‌లో నిర్వహించిన ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ SIR ప్రక్రియ ఓటర్ల నమోదు కార్యక్రమం కాదని ఓట్ల తొలగింపునకు ఉద్దేశించిన కార్యక్రమమని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం SIR ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఆయన ఆరోపించారు. ఇప్పటికే నమోదైన ఓట్లను తొలగించి, మళ్లీ ఓటు నమోదు చేసుకోవాలనే ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టిందని పేర్కొన్నారు కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఓటు చోరీకి పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందని తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మున్సిపల్ చైర్మన్లు పీఏసీఎస్ చైర్మన్లు ఆత్మ కమిటీ చైర్మన్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు అనుబంధ సంఘాల నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# నవంబర్ 2న తహశీల్దార్ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయండి

**ఆదివాసి సంఘాల ఐక్యవేదిక**

**దమ్మపేట ,మహా** : ఆదివాసి చట్టాలను ఏజెన్సీ ప్రాంతంలో అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన రెవిన్యూ శాఖ కార్యాలయం పై తిరుగుబాటు దిశగా నిర్ణయించిన తహశీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని ఆదివాసీలు జయప్రదం చేయాలని ఆదివాసి ఐక్యవేదిక సంఘం ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు.ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది . ఈ సమావేశంలో నవంబర్ 2 దమ్మపేట తహసిల్దార్ కార్యాలయం ముట్టడి కోసం విధివిధానాలు చర్చించటం జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలు చేయాలని, జీవో నెంబర్ 3 స్థానంలో కొత్త జీవో ఏర్పాటు చేసి ఆదివాసి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పీసా చట్టాన్ని పకడ్బందిగా అమలు చేయాలని , భూమి అడవిపై ఆదివాసులకు హక్కులు కల్పించాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు కొర్సా వెంకటేష్ దొర,బండారు సూర్యనారాయణ, తంబళ్ల రవి, కాకా శివశంకర్ ప్రసాద్, కొర్సా వీరరాజు, పెనుబల్లి రమేష్,కారం నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ అమరవీరుల స్మరణకు బైక్ ర్యాలీ

- 15వ బెటాలియన్ ఆధ్వర్యంలో సంస్మరణ వారోత్సవాలు
- జెండా ఊపి ప్రారంభించిన కమాండెంట్ పెద్దబాబు

**సత్తుపల్లి, అక్టోబరు 27**: మహా : దేశ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. బి. గంగారం బెటాలియన్ ప్రాంగణంలోని ఏజీ1 గేటు వద్ద కమాండెంట్ ఎన్. పెద్దబాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. బెటాలియన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సత్తుపల్లి రింగ్ సెంటర్ వరకు సాగి, అక్కడి నుంచి తిరిగి బెటాలియన్ ప్రాంగణానికి చేరుకుంది. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్. పెద్దబాబు మాట్లాడుతూ, విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను ప్రజలకు తెలియజేసి, సమాజంలో అవగాహన కల్పించడమే సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అమరవీరుల నిస్వార్థ సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు వి. వేణుగోపాల్ రెడ్డి, బి. వినాయకరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కె.వి. గోపాల్, పి. ఉదయకుమార్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు సూర్య, సాయి కుమార్, శ్రీనాథ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పత్రికా స్వేచ్ఛకు 'డేటా' సంకెళ్లు?

- డీపీడీపీ చట్టంపై సుప్రీంకోర్టు గడప తొక్కిన డిజిటల్ మీడియా
- కేంద్రానికి నోటీసు.. స్టేకు ససేమిరా
- పరిశోధనాత్మక జర్నలిజానికి ఉరితాడు: డీఎన్‌పీఏ
- నవంబరు 17న తదుపరి విచారణ



ఒక అక్రమార్కుడి బాగోతంపై కథనం రాయాలంటే ముందు ఆ అక్రమార్కుడికే సమాచారమిచ్చి, అతని అనుమతి తీసుకోవాలా? రాసిన కథనాన్ని తొలగించాలని అతడు కోరితే వెనక్కి తీసుకోవాలా? డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ (డీపీడీపీ) చట్టం అమలైతే దేశంలో జర్నలిస్టులు ఎదుర్కొనే దుస్థితి ఇదేనంటూ ప్రధాన మీడియా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన నెట్‌వర్క్ 18, అదానీ గ్రూప్‌నకు చెందిన ఎన్డీటీవీ, ఈనాడు టెలివిజన్ సహా 21 ప్రముఖ వార్తా సంస్థలు సభ్యులుగా ఉన్న డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (డీఎన్‌పీఏ) ఈ పిటిషన్ దాఖలు చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషన్‌పై స్పందన తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కేంద్రం వాదన వినకుండా చట్టం అమలుపై స్టే ఇవ్వలేమని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను నవంబరు 17కు వాయిదా వేసింది.

**'అనుమతి' పేరిట ముందస్తు సెన్సార్‌షిప్**

డీఎన్‌పీఏ తరఫున సీనియర్ న్యాయవాది మాధవీ దివాన్ వాదనలు వినిపించారు. పరిశోధనాత్మక కథనాల్లోని వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని జర్నలిస్టులను బలవంతం చేయడం పరోక్షంగా ముందస్తు సెన్సార్‌షిప్ విధించడమేనని ఆమె వాదించారు. ఇలా అనుమతి అడగాల్సి వస్తే వార్తా సంస్థలే మూతపడతాయని అన్నారు. సోషల్ మీడియా సంస్థలు ఖాతా తెరిచే సమయంలోనే వినియోగదారుల నుంచి అనుమతి తీసుకోగలవు. కానీ దర్యాప్తు చేస్తున్న వ్యక్తికే ముందు సమాచారమిచ్చి అనుమతి కోరితే, అతడు సాక్ష్యాలను ధ్వంసం చేసే, సాక్షులను బెదిరించే అవకాశం ఉంటుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. సమ్మతిని ఉపసంహరించుకుని తమ సమాచారాన్ని తొలగించాలని కోరే హక్కు కూడా ఈ చట్టం ప్రజలకు ఇస్తోంది. దీనివల్ల ప్రజాప్రయోజనం కోసం గతంలో ప్రచురించిన కథనాలను సైతం మార్చాల్సి రావచ్చు, ఆర్కైవ్‌ల నుంచి తొలగించాల్సి రావచ్చనని ప్రచురణకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం కోరేందుకు ప్రభుత్వానికి ఇచ్చిన అధికారాలతో రహస్య వార్తా వనరులకు ముప్పు వాటిల్లుతుందని కూడా వాదించారు.

**'డొమైన్ నిపుణులు' మీరే..**

విచారణ సందర్భంగా ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్య చేసింది. పిటిషనర్లు ఈ రంగంలో నిపుణులని, చట్టం దుర్వినియోగం కాకుండా ఎలా చూడాలో కేంద్రానికీ, కోర్టుకూ సూచించేందుకు వారే సరైనవారని వ్యాఖ్యానించింది.

హామీలు సరే.. రాతపూర్వక రక్షణేది?

ఈ ఏడాది ఆగస్టులో ప్రభుత్వంతో జరిగిన సమావేశంలో పత్రికా స్వేచ్ఛకు భంగం ఉండదని మీడియా సంస్థలకు హామీ లభించిందని రాయిటర్స్ పేర్కొంది. అయితే నోటి మాట హామీ సరిపోదని డీఎన్‌పీఏ అంటోంది. యూరోపియన్ యూనియన్, బ్రిటన్, సింగపూర్ వంటి దేశాల్లో జర్నలిజానికి చట్టంలోనే స్పష్టమైన మినహాయింపులు ఉన్నాయి. మన దగ్గర అలాంటి రాతపూర్వక రక్షణ లేకపోవడం ఆందోళనకరమని పిటిషన్‌లో పేర్కొంది. రాయిటర్స్ కథనం ప్రకారం 698 పేజీల ఈ పిటిషన్‌ను అక్టోబరు 6న దాఖలు చేశారు.

**డీఎన్‌పీఏలోని సభ్య సంస్థలు ఇవే**

• ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ • ది హిందూ పబ్లిషింగ్ • బెనెట్ కోల్‌మన్ (టైమ్స్ గ్రూప్) • టైమ్స్ ఇంటర్నెట్ • హెచ్‌టీ డిజిటల్ • బిజినెస్ స్టాండర్డ్ • ఇండియా టుడే • ఎన్డీటీవీ • నెట్‌వర్క్ 18 • ఇండియా టీవీ • జీ మీడియా కార్పొరేషన్ • ఏబీపీ • దైనిక్ భాస్కర్ • అమర్ ఉజాలా • జాగరణ్ న్యూ మీడియా • లోక్‌మత్ మీడియా • మలయాళ మనోరమ (మనోరమ ఆన్‌లైన్) • మాతృభూమి ప్రింటింగ్ అండ్ పబ్లిషింగ్ • ది ప్రింటర్స్ మైసూర్ • ఈనాడు టెలివిజన్పిటిషన్‌ను డీఎన్‌పీఏ తరఫున దాఖలు చేశారు. పై సంస్థలు ఆ సంఘంలోని సభ్యులు.

ఏమిటీ చట్టం?

డీపీడీపీ చట్టాన్ని కేంద్రం 2023లో తీసుకొచ్చింది. దాని అమలుకు సంబంధించిన నిబంధనలు (డీపీడీపీ రూల్స్2025) గత ఏడాది నవంబరులో నోటిఫై అయ్యాయి. డిజిటల్ రూపంలోని వ్యక్తిగత సమాచారాన్ని కాపాడటం దీని లక్ష్యం. మెటా, గూగుల్ వంటి టెక్ దిగ్గజాలపై కఠిన నిబంధనలు విధిస్తోంది. కానీ మీడియాకు ఎలాంటి ప్రత్యేక మినహాయింపూ ఇవ్వలేదు. అదే ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువైంది.

**ఇప్పటికే పలు సవాళ్లు**

ఈ చట్టంపై సుప్రీంకోర్టులో దాఖలైన తొలి పిటిషన్ ఇదేమీ కాదు. జర్నలిస్టు గీతా శేషు, సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ కలిసి ఒక పిటిషన్ వేశాయి. ది రిపోర్టర్స్ కలెక్టివ్, జర్నలిస్టు నితిన్ సేథి మరో పిటిషన్ వేశారు. సమాచార హక్కు కార్యకర్త వెంకటేశ్ నాయక్, ఎన్‌సీపీఆర్ఐ కూడా వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ చట్టం సమాచార హక్కును నీరుగారుస్తోందన్నది వీరి ప్రధాన అభ్యంతరం. ఫిబ్రవరిలో వాటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కేసును పెద్ద ధర్మాసనానికి నివేదించింది. అప్పుడు కూడా చట్టం అమలుపై స్టే ఇవ్వలేదు. ఆ పిటిషన్లు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. ఇప్పుడు ప్రధాన స్రవంతి మీడియా సంస్థల సంఘం కూడా రంగంలోకి దిగడంతో ఈ న్యాయపోరాటానికి మరింత బలం చేకూరింది.

# ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వ ప్రస్థానంపై పుస్తకావిష్కరణ

- డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డితో ఐసీపీఆర్‌డీ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ భేటీ.
- 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనే ధ్యేయంగా దేశ ప్రగతిపై ప్రత్యేక చర్చ

**న్యూఢిల్లీ, మహా :** భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పార్టీ మాజీ కోఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డిని న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంప్రహెన్సివ్ పాలసీ అండ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు శ్రీ కె.ఆర్. రాజీవ్ రంజన్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ శైలి, ఆయన రాజకీయ ప్రయాణం, దేశంలో తీసుకువచ్చిన సుపరిపాలన సంస్కరణల విశేషాలతో శ్రీ కె.ఆర్. రాజీవ్ రంజన్ సింగ్ స్వయంగా రచించిన ఒక ప్రత్యేక పుస్తకాన్ని డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డికి అందజేశారు.ఈ సమావేశంలో భారతదేశ అభివృద్ధి గమనం, ప్రజా విధానాలు (పబ్లిక్ పాలసీ), నాయకత్వ లక్షణాలు, దేశ భవిష్యత్తు ఆకాంక్షలపై ఇరువురు ప్రముఖులు విస్తృతంగా అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రధానంగా 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన, స్వయంసమృద్ధి గల భారత్‌గా మార్చాలనే 'వికసిత్ భారత్ 2047' స్వప్నం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్న అంకితభావాన్ని ఈ భేటీ ప్రతిబింబించింది.భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలు, చారిత్రాత్మక నిర్ణయాలు, పరివర్తనాత్మక కార్యక్రమాలను పుస్తకాల రూపంలో డాక్యుమెంట్ చేయడం ఎంతైనా అభినందనీయమని డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. దేశ ప్రగతి కోసం మేధోపరమైన చర్చలు, నిర్మాణాత్మక సంభాషణలు, సమిష్టి కృషితో ముందుకు సాగాల్సిన ప్రాముఖ్యతను ఈ సమావేశం మరోసారి నొక్కిచెప్పింది.



# ఈ ఏడాదిలోనే అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..

- నాణ్యతా ప్రమాణాలను కచ్చితం-గా పాటించాలి..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ, సీఆర్ఆర్, ఎస్టీఎస్‌డీఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఎఫ్‌డీఆర్ తదితర నిధులతో మంజూరైన పనులు, నిర్మాణంలో ఉన్నవి, పెండింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, స్వయం సహాయక సంఘాల భవనాలు, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, రహదారుల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి మండలంలో పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొని పనుల పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి..

- విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు /అశ్వాపురం, మహా :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పినపాక ఎమ్మెల్యే, శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని నెల్లిపాక బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అశ్వాపురం-మణుగూరు జోనల్ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. వాలీబాల్ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్య, క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం క్రీడా పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి విద్యార్థులకు అవసరమైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అశ్వాపురం, మణుగూరు మండల విద్యాధికారులు, తహసీల్దార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# భారీ వర్షా ల నేపథ్యంలో.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి..

**మణుగూరు, మహా** : తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్, భద్రాచలం సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీకాంత్, సీఐ పాటి నాగబాబుల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో దండోరా, మైకుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో గోదావరి నదిలో చేపల వేట, ఇసుక తవ్వకాలు, లోతట్టు ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. పొంగిపొర్లే వాగులు, వంకలు, కల్వర్టులను దాటకుండా హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రమాదకర ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రవాణా, సహాయక ఏర్పాట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ అధికారులు, జీపీవోలు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు సంబంధిత అధికారులు తమ ప్రధాన కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. సమావేశంలో మణుగూరు తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# మణుగూరు ఎఫ్‌డీఓగా రాధిక..

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసిన ఎఫ్‌డీఓ**

**మణుగూరు, మహా :** మణుగూరు ఎఫ్‌డీఓగా బి రాధిక బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలో శాఖాపరమైన కార్యక్రమాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలందించడం, అధికారుల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.



## అమెరికా రాజకీయాల్లో
# సమోసా కాకస్ సత్తా

అమెరికా రాజకీయ గమనాన్ని శాసించే స్థాయికి ఎదిగిన భారతీయ సంతతి ప్రవాసులు ఇప్పుడు మరో కీలక ప్రజాక్షేత్ర పరీక్షకు సిద్ధమయ్యారు. ప్రపంచ అత్యున్నత ప్రజాస్వామ్యంలో టెక్నాలజీ, వ్యాపారం, వైద్య రంగాల తర్వాత పాలిటిక్స్‌లోనూ తమదైన ముద్ర వేస్తున్న ఇండియన్‌అమెరికన్స్ ప్రాతినిధ్యంపై నూతన మిడ్‌టర్మ్ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. అమెరికా రాజకీయాల్లో భారత సంతతి నాయకుల ప్రభావం వేగంగా పెరుగుతోంది. ఇప్పుడు అక్కడి భారత సంతతి ప్రజల రాజకీయ ప్రాతినిధ్యానికి నవంబర్ 3న జరగనున్న మిడ్ టర్మ్ ఎన్నికలు కీలక పరీక్షగా మారనున్నాయి. వ్యాపారం, టెక్నాలజీ, విద్య, ప్రభుత్వ రంగాల్లో ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇండియన్ అమెరికన్స్ ఇప్పుడు అమెరికా కాంగ్రెస్‌లో తమ ప్రాతినిధ్యాన్ని నిలబెట్టుకోవడంతో పాటు మరింత విస్తరించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర శాసనసభలు, అమెరికా కాంగ్రెస్ వరకు అమెరికా ప్రజా జీవితంలో ఇప్పటికే తమ ఉనికిని విస్తరించుకుంటూ వస్తున్న భారత సంతతి వర్గానికి మిడ్ టర్మ్స్ కీలకంగా మారాయి. అమెరికాలో భారత సంతతికి చెందిన చట్టసభ్యులను అనధికారికంగా సమోసా కాకస్ అని పిలుస్తారు. ఈ బృందంలో ప్రస్తుతం ఉన్న ఆరుగురిలో ఇద్దరు వచ్చే ఎన్నికల తర్వాత ప్రతినిధుల సభలో (హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్) ఉండే అవకాశం కోల్పోయారు. దీంతో మిగిలిన సభ్యుల విజయావకాశాలు ఎలా ఉండనున్నాయి? కొత్త అభ్యర్థులపై అంచనాలు ఏంటనే ఆసక్తి పెరిగింది. అమెరికా ప్రతినిధుల సభలో భారత సంతతికి చెందిన సభ్యులను మీడియా అనధికారికంగా సమోసా కాకస్ అని పిలుస్తుంది. ఇది అధికారిక రాజకీయ కూటమి కాదు. ఒక అనధికారిక పేరుగా చెప్పొచ్చు. ప్రస్తుతం ఈ బృందంలో ఉన్న ఆరుగురు డెమోక్రటిక్ పార్టీకి చెందినవారే. అయితే భారత సంతతి అభ్యర్థులు రిపబ్లికన్ పార్టీ తరఫున కూడా పోటీ చేస్తున్నారు. ఈ బృందంలోని రాజా కృష్ణమూర్తి ఇల్లినాయిస్ నుంచి యూఎస్ సెనేట్‌కు పోటీ చేయాలని నిర్ణయించుకొని డెమోక్రటిక్ ప్రైమరీలో ఓడిపోయారు. మిషిగన్‌కు చెందిన శ్రీ థానేదార్ కూడా తన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రైమరీలో (డెమోక్రటిక్ కాంగ్రెషనల్ ప్రైమరీ) ఓటమి పాలయ్యారు. దీంతో ఈ ఇద్దరు మళ్లీ ప్రతినిధుల సభకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

రో ఖన్నా, ప్రమీలా జయపాల్ ప్రయత్నాలు

కాలిఫోర్నియాలోని 17వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి డెమోక్రటిక్ నేత రో ఖన్నా మరోసారి ఎన్నిక వ్వాలని ప్రయత్నిస్తున్నారు. 2016లో తొలిసారి ప్రతినిధుల సభకు ఎన్నికైన ఆయన టెక్నాలజీ విధానాలు, ఆర్థిక అసమానతలు, తయారీ రంగం, ఎన్నికల నిధుల సంస్కరణలపై పనిచేశారు. అయితే ఆయనకు భారత సంతతికే చెందిన రిపబ్లికన్ అభ్యర్థి రితేష్ టాండన్ పోటీ ఇస్తున్నారు. సిలికాన్ వ్యాలీ ప్రాంతంలో ఈ నియోజకవర్గంపై సాధారణంగా డెమోక్రటిక్ పార్టీకే మంచి పట్టు ఉంది. ఇక వాషింగ్టన్ రాష్ట్రంలోని 7వ నియోజకవర్గం నుంచి ప్రమీలా జయపాల్ పోటీ చేస్తున్నారు. చెన్నైలో జన్మించిన ఆమె 16 ఏళ్ల వయసులోనే అమెరికాకు వెళ్లారు. ఇక ఆమె అమెరికన్ రాజకీయాల్లో భారత సంతతికి చెందిన అత్యంత ప్రముఖుల్లో ఒకరిగా నిలిచారు. 2017 నుంచే ఆమె ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆరోగ్య సేవలు, వలస విధానం, కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలపై ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక ఈమెకు భారత సంతతికి చెందిన రిపబ్లికన్ క్యాండిడేట్ నిరవ్ షేత్ సవాల్ విసురుతున్నారు. ఈ నియోజకవర్గంలో కూడా డెమోక్రటిక్ పార్టీకి బలమైన మద్దతు ఉండటంతో జయపాల్‌కు అనుకూల పరిస్థితులు ఉన్నాయని అంచనా.

కాలిఫోర్నియాలోని 3వ నియోజకవర్గం నుంచి ప్రముఖ ఫిజీషియన్ అమీ బేరా మరోసారి ఎన్నికల బరిలో ఉన్నారు. 2013 నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఆయన భారత సంతతి నేతల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిలో ఒకరుగా ఉన్నారు. వర్జీనియాలోని 10వ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సుహాస్ సుబ్రమణ్యం 2025లో కాంగ్రెస్‌లోకి ప్రవేశించారు. గతంలో వర్జీనియా రాష్ట్ర శాసనసభలో పనిచేయడంతో పాటు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రభుత్వంలోనూ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు తిరిగి ఎన్నిక కావాలని ప్రయత్నిస్తున్నారు. రిపబ్లికన్ అభ్యర్థి దేవ్ బెక్‌విత్ ఆయనకు పోటీ ఇస్తున్నారు. ఇక్కడ ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రజా సేవలకు సంబంధించిన అంశాలు ఈ పోటీలో ప్రభావం చూపొచ్చని భావిస్తున్నారు.

**2. ప్రధాన పార్టీల వ్యూహాలు**

**డెమోక్రటిక్ పార్టీ వ్యూహం:**

సాంప్రదాయకంగా భారతీయఅమెరికన్లు ఎక్కువ శాతం డెమోక్రాట్ల వైపే మొగ్గు చూపుతారు.

వలస విధానాలు, విద్యా రంగం, ఆరోగ్య సంరక్షణ మరియు పౌర హక్కుల అంశాలను ప్రాతిపదికగా చేసుకుని డెమోక్రాట్లు ప్రచారం నిర్వహిస్తున్నారు.

హెచ్ 1బీ వీసాదారుల సమస్యలు, గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్ వంటి అంశాలపై స్పష్టమైన హామీలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**రిపబ్లికన్ పార్టీ వ్యూహం:**

రిపబ్లికన్లు ప్రధానంగా వ్యాపార అనుకూల విధానాలు, పన్నుల తగ్గింపు మరియు బలమైన ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. భారత సంతతికి చెందిన చిన్న వ్యాపార యజమానులు, టెక్ ప్రొఫెషనల్స్ మరియు వైద్యులను ఆకర్షించడానికి ప్రత్యేక 'ఔట్‌రీచ్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బలమైన విదేశాంగ విధానం, ముఖ్యంగా భారత్‌అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రచారం చేస్తున్నారు.

**3. ఎన్నికలను ప్రభావితం చేసే ప్రధానాంశాలు**

ద్రవ్యోల్బణం, ఆర్థిక వ్యవస్థ: అమెరికాలో నిత్యావసరాలు, ద్రవ్యోల్బణం మరియు జీవన వ్యయం పెరగడం ఈ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అతిపెద్ద అంశాలు.

వృత్తిపరమైన వీసాలు: టెక్ రంగంలో పనిచేసే ఇండియన్‌అమెరికన్లకు హెచ్ 1బీ వీసాలు, శాశ్వత నివాసం ప్రక్రియను సులభతరం చేయడం వంటి సమస్యలపై అన్ని పార్టీల అభ్యర్థుల వైఖరిపై తీవ్ర చర్చ జరుగుతోంది.

**మహా డెస్క్**

> **భారత సంతతి**
> **అభ్యర్థుల గెలుపు అవకాశాలు**
> **సీనియర్ నేతల పట్టు:** రో ఖన్నా, అమీ బెరా, ప్రమీలా జయపాల్ వంటి సీనియర్ మరియు అనుభవజ్ఞులైన నాయకులు తమ నియోజక వర్గాల్లో బలమైన ప్రజా మద్దతును కలిగి ఉన్నారు. వారి స్థానాల్లో వారి విజయావకాశాలు ఇప్పటికీ పటిష్టంగానే ఉన్నాయి.
> కొత్త నాయకత్వానికి వేదిక: రాజా కృష్ణమూర్తి, శ్రీ థానేదార్ వంటి వారు ప్రైమరీలలో ఎదురుదెబ్బలు ఎదుర్కొన్నప్పటికీ, కొత్త ప్రాంతాల నుంచి బరిలోకి దిగుతున్న యువ అభ్యర్థులు మరియు కొత్త ముఖాలు సమోసా కాకస్ బలాన్ని భవిష్యత్తులో మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.
> **ద్విసభ్య పోటీ:** కేవలం డెమోక్రటిక్ పార్టీ మాత్రమే కాకుండా, రిపబ్లికన్ పార్టీ తరఫున కూడా భారత సంతతి అభ్యర్థులు పోటీ చేస్తుండటం విశేషం. ఇది రెండు పార్టీలు ఈ వర్గం బలాన్ని గుర్తిస్తున్నాయనేందుకు స్పష్టమైన సంకేతం.

## ఎన్నికల్లో ఏ అంశాలు కీలకం?

**భారత సంతతి ఓటర్లతో పాటు ఇతర వర్గాల ఓటర్ల మద్దతు పొందడం అభ్యర్థులకు చాలా ముఖ్యం. ఇళ్ల అద్దెలు, ఆరోగ్య సేవల ఖర్చులు, విద్య, ఉద్యోగాలు, వలస విధానం, పౌర హక్కులు, అమెరికా- భారత్ సంబంధాలు వంటి అంశాలు కూడా ఎన్నికలపై ప్రభావం చూపొచ్చు. 2026లో నిర్వహించిన ఏఏపీఐ డేటా సర్వేలో భారతీయ అమెరికన్ ఓటర్లు సాధారణంగా డెమోక్రటిక్ కాంగ్రెస్ అభ్యర్థులకు 66 శాతం, రిపబ్లికన్ అభ్యర్థులకు 18 శాతం మద్దతు తెలిపినట్లు రిపోర్ట్ పేర్కొంది. మొత్తంగా ఈ అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రో ఖన్నా, ప్రమీలా జయపాల్, అమీ బేరా, సుహాస్ సుబ్రమణ్యం తమ స్థానాలను నిలబెట్టుకుంటే, అమిష్ షా, పియా దండియా కొత్తగా గెలిస్తే సమోసా కాకస్ సభ్యుల బలం మళ్లీ ఆరుకు చేరొచ్చు. వీరిలో ఒక్కరు మాత్రమే ఓడిపోతే ఐదుగురు, ఇద్దరూ ఓడిపోతే నలుగురు మిగిలే అవకాశం ఉంది. ఈ ఫలితాలు కేవలం భారత సంతతి నేతల సంఖ్యనే కాకుండా, అమెరికా రాజకీయాల్లో వారి ప్రభావాన్ని కూడా ప్రతిబింబిస్తాయి**

# ప్రజాగళమే ప్రజాస్వామ్యానికి బలం!

> ప్రజల ఆందోళనలకు పరిష్కారాలు చూపడమే పాలకుల బాధ్యత.. నిరసనలను అణచివేయడం కాదు! రాజ్యాంగ హక్కులకు రక్షణ, సంస్థల విశ్వసనీయత, పాలనలో పారదర్శకతే ప్రజాస్వామ్యానికి పునాదులు".



ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్రబిందువు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలి. వారి హక్కులకు భరోసా కల్పించాలి. వారి ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. కానీ ప్రజలు తమ సమస్యలపై గళమెత్తినప్పుడు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినప్పుడు పాలకుల స్పందన ఎలా ఉంటుందన్నదే ప్రజాస్వామ్య విలువలకు అసలైన పరీక్ష. నిరసనలను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా గుర్తించి, వాటి వెనుక ఉన్న కారణాలను విశ్లేషించాల్సిన ప్రభుత్వాలు.. వాటిని పాలనకు ఎదురైన సవాలుగా భావిస్తే ప్రజలకు, పాలకులకు మధ్య దూరం పెరుగుతుంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజా ఉద్యమాలు, వాటిపై ప్రభుత్వ స్పందన ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరుపై పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోరుతూ విద్యార్థుల ఆందోళనలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై అభ్యంతరాలు వేర్వేరు అంశాలుగా కనిపించినా.. వాటి వెనుక ఉన్న ప్రధాన ప్రశ్న వ్యవస్థల విశ్వసనీయతకు సంబంధించినదే. విద్యార్థుల భవిష్యత్తు, పౌరుల ఓటు హక్కు వంటి కీలక అంశాల్లో సందేహాలు తలెత్తినప్పుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలపై ఉంటుంది. ప్రజల ఆందోళనలకు సమాధానాలు చెప్పడం, లోపాలుంటే సరిదిద్దడం, పారదర్శకతను పెంపొందించడం ద్వారానే వ్యవస్థలపై విశ్వాసాన్ని నిలబెట్టుకోగలరు. ప్రజాస్వామ్యంలో అసమ్మతికి చోటుండాలి.. నిరసనలకు విలువుండాలి.. ప్రజల గొంతు వినిపించే స్వేచ్ఛకు భరోసా ఉండాలి. ఎందుకంటే ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన పునాది.

**నమ్మకమే ప్రజాస్వామ్యానికి బలం**

ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల నిర్వహణకు, ప్రభుత్వాల ఏర్పాటుకు మాత్రమే పరిమితం కాదు. రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పనిచేస్తున్నాయనే విశ్వాసం ప్రజల్లో ఉండాలి. ఎన్నికల సంఘం వంటి సంస్థల నిర్ణయాలపై సందేహాలు వ్యక్తమైనప్పుడు వాటిని నివృత్తి చేసేందుకు తగిన వివరణలు ఇవ్వాలి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించాలి. అభ్యంతరాలను పరిశీలించి, తప్పులున్నట్లు తేలితే సరిదిద్దాలి. ఆరోపణలు వచ్చినంత మాత్రాన అవి నిజమని నిర్ధారించలేం. అదే సమయంలో వాటిని ఆధారాలతో పరిశీలించకుండా తోసిపుచ్చడమూ సరికాదు. ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయత వాటి అధికారాలపైనే కాకుండా, వాటి పనితీరుపై ప్రజలకు ఉండే నమ్మకంపైనా ఆధారపడి ఉంటుంది. అందుకే సందేహాలను నివృత్తి చేయడం, వాస్తవాలను వెల్లడించడం, అవసరమైన దిద్దుబాట్లు చేపట్టడం అత్యంత ముఖ్యం.

**పాలకుల జవాబుదారీతనమే కీలకం**

ప్రజా ఉద్యమాలను ఎదుర్కొనే క్రమంలో ప్రభుత్వాలు సంయమనం పాటించాలి. నిరసనలకు దారితీసిన కారణాలను గుర్తించి, సంబంధిత వర్గాలతో చర్చించాలి. సమంజసమైన డిమాండ్లను పరిష్కరించాలి. ఆచరణ సాధ్యం కాని అంశాలుంటే అందుకు కారణాలను వివరించాలి. ప్రజలకు సమాధానాలు చెప్పడం పాలకుల బలహీనత కాదు.. అది వారి ప్రజాస్వామిక బాధ్యత. అదే సమయంలో నిరసనకారులు కూడా శాంతియుతంగా, రాజ్యాంగ పరిధిలో తమ హక్కులను వినియోగించుకోవాలి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సమాజం తమ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించినప్పుడే పరస్పర విశ్వాసం బలపడుతుంది. విమర్శలను శత్రుత్వంగా భావించకుండా, వాటిలోని వాస్తవాలను పరిశీలించి అవసరమైన దిద్దుబాట్లు చేపట్టాలి. సంస్థల స్వతంత్రతను కాపాడటం, పాలనలో పారదర్శకతను పెంపొందించడం, ప్రజల ప్రశ్నలకు జవాబుదారీగా స్పందించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు అత్యవసరం.ప్రజల గొంతును అణచివేయడం ద్వారా తాత్కాలిక నిశ్శబ్దాన్ని సాధించవచ్చేమో కానీ, వారి విశ్వాసాన్ని బలవంతంగా పొందలేరు. ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవడం, హక్కులను గౌరవించడం, వ్యవస్థల్లోని లోపాలను సరిదిద్దడం ద్వారానే ప్రజాస్వామ్య పునాదులను పటిష్ఠం చేయగలరు. అధికారంలో ఎవరున్నా ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిందే. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, వారి హక్కులకు భరోసా కల్పించడం, సంస్థల విశ్వసనీయతను కాపాడటం పాలకుల ప్రాథమిక కర్తవ్యం. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం.. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే పాలనకు నిజమైన గీటురాయి!

### నిరసన హక్కును గౌరవించాలి

భారత రాజ్యాంగం పౌరులకు భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కల్పించింది. ప్రభుత్వ విధానాలతో విభేదించడం, నిర్ణయాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ. అసమ్మతిని వ్యక్తం చేసే అవకాశమే లేని వ్యవస్థలో ప్రజాభిప్రాయానికి విలువ తగ్గిపోతుంది. అందుకే శాంతియుత నిరసనలను ప్రజాస్వామ్యానికి ముప్పుగా చూడకూడదు. అయితే నిరసనల పేరుతో హింసకు పాల్పడటం, ప్రజా ఆస్తులకు నష్టం కలిగించడం, సాధారణ పౌరుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడం కూడా సమర్థనీయం కాదు. శాంతి భద్రతలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతే. అయితే ఆ పేరుతో పౌరుల రాజ్యాంగ హక్కులకు భంగం కలగకుండా చూడాలి. నిరసనలపై విధించే ఆంక్షలు చట్టబద్ధంగా, అవసరానికి అనుగుణంగా ఉండాలి.నిరసనకారుల డిమాండ్లను వినకుండా నిర్బంధాలతో సమస్యను పరిష్కరించాలనుకోవడం తాత్కాలిక ఫలితాలకే పరిమితమవుతుంది. ఆందోళనలను తాత్కాలికంగా నిలువరించగలిగినా, వాటికి కారణమైన సమస్యలను పరిష్కరించకపోతే అసంతృప్తి కొనసాగుతుంది. ప్రజల గొంతును వినడం, వారి ఆవేదనను అర్థం చేసుకోవడం, చర్చల ద్వారా పరిష్కారాలను అన్వేషించడమే ప్రజాస్వామిక పాలన లక్షణం.

### యువత ఆకాంక్షలను విస్మరించలేరు

విద్య, ఉపాధి, సమాన అవకాశాలపై యువత ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చినా, ఫలితాలపై సందేహాలు వ్యక్తమైనా వాటిని తీవ్రంగా పరిగణించాలి. విద్యార్థుల శ్రమ, సమయం, భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో నిర్లక్ష్యానికి తావుండకూడదు. వారి ఆందోళనలను రాజకీయ ప్రేరేపణగా కొట్టిపారేయకుండా వాస్తవాలను పరిశీలించాలి. తప్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. వ్యవస్థలో లోపాలుంటే సరిదిద్దాలి.ప్రజా ఉద్యమాలకు రాజకీయ పార్టీలు మద్దతు తెలపడం ప్రజాస్వామ్యంలో సహజమే. అయితే ప్రతి నిరసన వెనుక రాజకీయ కుట్ర ఉందని భావించడం ఎంతవరకు సరికాదో, ఉద్యమాల పేరుతో జరిగే ప్రతి చర్యను సమర్థించడం కూడా అంతే సరికాదు. ఉద్యమాల డిమాండ్లు, వాటికి సంబంధించిన ఆధారాలను నిష్పాక్షికంగా పరిశీలించాలి. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యమివ్వాలి.



**అమరవాజీ నాగరాజు**
**టీపీసీసీ ప్రెసిడెంట్ పీఆర్ఓ**

> "ప్రజల ఆందోళనలకు పరిష్కారాలు చూపడమే పాలకుల బాధ్యత.. నిరసనలను అణచివేయడం కాదు! రాజ్యాంగ హక్కులకు రక్షణ, సంస్థల విశ్వసనీయత, పాలనలో పారదర్శకతే ప్రజాస్వామ్యానికి పునాదులు"

> ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్రబిందువు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలి. వారి హక్కులకు భరోసా కల్పించాలి. వారి ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. కానీ ప్రజలు తమ సమస్యలపై గళమెత్తినప్పుడు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినప్పుడు పాలకుల స్పందన ఎలా ఉంటుందన్నదే ప్రజాస్వామ్య విలువలకు అసలైన పరీక్ష.

> ప్రజాస్వామ్యంలో అసమ్మతికి చోటుండాలి.. నిరసనలకు విలువుండాలి.. ప్రజల గొంతు వినిపించే స్వేచ్ఛకు భరోసా ఉండాలి. ఎందుకంటే ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన పునాది.

> నిరసనల పేరుతో హింసకు పాల్పడటం, ప్రజా ఆస్తులకు నష్టం కలిగించడం, సాధారణ పౌరుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడం కూడా సమర్థనీయం కాదు. శాంతిభద్రతలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతే. అయితే ఆ పేరుతో పౌరుల రాజ్యాంగ హక్కులకు భంగం కలగకుండా చూడాలి. నిరసనలపై విధించే ఆంక్షలు చట్టబద్ధంగా, అవసరానికి అనుగుణంగా ఉండాలి.

> ప్రజా ఉద్యమాలను ఎదుర్కొనే క్రమంలో ప్రభుత్వాలు సంయమనం పాటించాలి. నిరసనలకు దారితీసిన కారణాలను గుర్తించి, సంబంధిత వర్గాలతో చర్చించాలి. సమంజసమైన డిమాండ్లను పరిష్కరించాలి. ఆచరణ సాధ్యం కాని అంశాలుంటే అందుకు కారణాలను వివరించాలి. ప్రజలకు సమాధానాలు చెప్పడం పాలకుల బలహీనత కాదు.. అది వారి ప్రజాస్వామిక బాధ్యత. అదే సమయంలో నిరసనకారులు కూడా శాంతియుతంగా, రాజ్యాంగ పరిధిలో తమ హక్కులను వినియోగించుకోవాలి.

> ప్రజల గొంతును అణచివేయడం ద్వారా తాత్కాలిక నిశ్శబ్దాన్ని సాధించవచ్చేమో కానీ, వారి విశ్వాసాన్ని బలవంతంగా పొందలేరు. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం.. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే పాలనకు నిజమైన గీటురాయి.

# పెరుగుతున్న బియ్యం ధరలు

తెలంగాణలో బియ్యం ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోంది. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి, పేద కుటుంబాలకు బియ్యం ధరలు మరింత భారంగా మారుతున్నాయి. ప్రతి ఇంట్లో రోజువారీ ఆహారంలో బియ్యానికి ప్రధాన స్థానం ఉండటంతో ధరల్లో స్వల్ప పెరుగుదల వచ్చినా నెలవారీ కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా సన్నబియ్యం కొనుగోలు చేసే కుటుంబాలు అధిక ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

పెరుగుతున్న ఖర్చులు

రాష్ట్రంలో వరి సాగు విస్తృతంగా జరుగుతున్నప్పటికీ, బియ్యం ధరలు పెరగడానికి సరఫరా, నిల్వలు, మిల్లింగ్, రవాణా ఖర్చులు, మార్కెట్‌లో డిమాండ్ వంటి అంశాలు కారణమవుతాయి. బియ్యం రకం, నాణ్యత, ప్రాంతాన్ని బట్టి ధరల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. నెలవారీగా బియ్యం కొనుగోలుకు ఎక్కువ మొత్తం వెచ్చించాల్సి రావడంతో కుటుంబాలు ఇతర అవసరాల ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పిల్లల చదువులు, వైద్యం, ఇంటి అద్దె వంటి ఖర్చులను నిర్వహించడం కష్టంగా మారుతోంది.

**ధరల నియంత్రణకు చర్యలు అవసరం**

బియ్యం ధరల పెరుగుదలకు గల కారణాలను సంబంధిత అధికారులు పరిశీలించాలి. మార్కెట్‌లో నిల్వలు, సరఫరా పరిస్థితులను పర్యవేక్షిస్తూ అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే చర్యలు ఉన్నాయా అని తనిఖీ చేయాలి. అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన బియ్యం సకాలంలో అందేలా చూడాలి. రైతులకు గిట్టుబాటు ధర లభిస్తూనే వినియోగదారులకు బియ్యం అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం సమతుల్య చర్యలు చేపట్టాలి. ధరల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రైతు ప్రయోజనాలను కాపాడటంతో పాటు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై భారం తగ్గించినప్పుడే ప్రజలకు నిజమైన ఉపశమనం లభిస్తుంది.





# పోలీస్ అమరవీరులకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఘన నివాళి

- పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ
- పాల్గొన్న వరంగల్ సీపీ, ఎన్పిడిసిఎల్ సిఎండి, జిల్లా కలెక్టర్, అధికారులు

**హనుమకొండ, మహా :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి, ఐపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీ ప్రజల్లో ఆరోగ్యం పై అవగాహన కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే సందేశాన్ని అందించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎన్ పి డిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రై సిటీ లోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ వారికి అంకితమైన ఘనమైన నివాళి అని తెలిపారు.సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా 89 సంవత్సరాల వయస్సులోనూ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మామిడి నర్సయ్య ను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకమని, వయస్సు అనేది వ్యాయామానికి అడ్డంకి కాదని ఈ ర్యాలీ నిరూపించిందని తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు.




# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు
- రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో 101 యూనిట్ల రక్తం సేకరణ
- స్వయంగా రక్తదానం చేసిన పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

**హనుమకొండ, మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పెద్ద ఎత్తున వివిధ కార్యక్రమాలను విజయవంతంగా చేపడుతున్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో భీమారం శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిభిరంలో 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని ఇంత జార్గంజ్, మట్వాడ, ఏజె మిల్స్ కాలనీ పోలీసుల ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఇన్స్పెక్టర్ లతో పాటు జర్నలిస్టులు సైతం పాల్గొని రక్తదాతలుగా నిలిచారు. ఈ సందర్భంగా రక్త దానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన జర్నలిస్టులను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి. శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేంద్ర, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి.శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, రెడ్ క్రాస్ జిల్లా పాలక మండలి సభ్యులు కె.రాకేష్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ ఎనుమాముల మార్కెట్లో పసుపు హల్ చల్

- పసుపు రైతుకు పండుగ రికార్డు స్థాయిలో పలికిన
- మార్కెట్లో పసుపు క్వింటాలుకు రూ. 9095



**వరంగల్,బ్యూరో మహా ;** ఆసియా ఖండంలోనే వ్యవసాయ మార్కెట్ల లో రెండోవ స్థానంలో నిలిచిన వరంగల్ జిల్లాలోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్లో పసుపు రైతులకు పండుగను తలపించేలా పసుపుకు రికార్డు స్థాయి ధర పలికింది. క్వింటా పసుపు 9095 రూపాయల ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ లో పసుపు రైతుల ముఖాల్లో చిరునవ్వు వెల్లివిరిసింది. నిన్నటి మార్కెట్ లో పసుపు ధరలు ఆకాశాన్ని తాకాయి. గూగులోతు లాలు నాయక్ అనే రైతు తీసుకొచ్చిన పసుపు పంటకు క్వింటాకు 9095 రూపాయల రికార్డు స్థాయి ధర లభించింది. ఈ సీజన్ లో ఇదే అత్యధిక ధరగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పసుపు సాగుకు అధిక పెట్టుబడి, కూలీల కొరత, వాతావరణ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ, ఈ రికార్డు ధర రైతులకు కొంత ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా రైతు గూగులోతు లాలు నాయక్ మాట్లాడుతూ... పసుపు పంట కోసం ఎంతో కష్టపడ్డానని, మంచి దిగుబడి వచ్చిందని, మార్కెట్లో మంచి ధర రావడంతో చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రైతులు నాణ్యమైన పసుపును పండిస్తే మంచి ధర వస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఎనుమాముల మార్కెట్లో పసుపుకు మంచి డిమాండ్ ఉండటంతో ఇతర రైతులు కూడా తమ పంటను మార్కెట్ కు తీసుకురావాలని మార్కెట్ అధికారులు సూచిస్తున్నారు. పసుపు రైతులకు ఈ ధర మరింత ప్రోత్సాహాన్నిస్తుందని రైతు సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక దృష్ట్యా న్యాయవాదులతో భేటీ...

- కోర్టు నూతన భవనం రోడ్డు సౌకర్యం కల్పనపై ఎమ్మెల్యే దృష్టి...
- న్యాయవాదుల ఒక్కో సమస్యకు పరిష్కారం చూపుతున్నాం...
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి...
- న్యాయవాది సామ రామ్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీగా నిలబెట్టామన్న మల్‌రెడ్డి...
- పట్టభద్రులంతా ఓటు నమోదుచేసుకోవాలని సూచనలు..



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 27 మహా:** దశాబ్దాల క్రితం నిర్మించిన ఇబ్రహీంపట్నం కోర్టు భవనం స్థానంలో నూతన కట్టడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటు ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నలో బార్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులు లేవనెత్తిన పలుసమస్యలు, ఇతర అంశాలపై చర్చించిన ఎమ్మెల్యే... పరిష్కారానికి హామీ ఇచ్చారు.

**కోర్టు నూతన భవనం....**

ఇబ్రహీంపట్నం కోర్టు నూతన భవనం అంశం ఇప్పటికే పరిశీలనలో ఉందని, కొత్త భవనంతోపాటు కోర్టు వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక దృష్టి సారిస్తానని మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. న్యాయవాదుల రక్షణ కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన... అడ్వకేట్ల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. న్యాయవాదులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అడ్వకేట్ల పాత్ర మరువలేనిదన్నారు.

**వృత్తిరిత్యా న్యాయవాది సామ...**

వృత్తిరిత్యా న్యాయవాది అయిన సామ రామ్మోహన్‌రెడ్డిని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిగా నిలబెట్టామని మల్‌రెడ్డి చెప్పారు. పట్టభద్రులందరూ ఓటు నమోదుచేసుకుని, రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయవాదుల సమస్యల పరిష్కారం సాధ్యమన్న ఎమ్మెల్యే... ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానన్న మల్‌రెడ్డి రంగారెడ్డి... ఇబ్రహీంపట్నం అభివృద్ధిలో న్యాయవాదులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ పీపీ వేణుగోపాల్ రెడ్డి, న్యాయవాదులు రాములు, వెంకట్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## 'జలసిరి' కార్యక్రమం పై అవగాహన కల్పిస్తున్న యంపిడివో

**దమ్మపేట ,మహా :** మండల పరిదిలోని లింగాల పల్లి ,జమేదారు బంజర , పార్కలగండి , దమ్మపేట పంచాయతీ లలో మంగళవారం యంపిడివో రవీంద్ర రెడ్డి 'జలసిరి ' కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఆయా పంచాయతీ లలోని సర్పంచ్ లు ,కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు ఎల్నినోని ప్రభావం పై అవగాహన కల్పించారు. ఈ విషయమై రాబోవు ముందుతరంలో వాతావరణం లోని విషమతుల్య పరిస్థితి తుల నేపధ్యంలో విపరీతమైన నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. కాబట్టి ప్రభుత్వ సూచన మేరకు జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలసిన అవశ్యకత మనందరిపై ఉందని సూచించారు. దానిలో భాగంగా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని ,వృధా నీటిని కూడా రక్షించుకోవాలసిన అవసరం ఉందన్నారు. నీటి సాంద్రత పెరిగినప్పడే , భూ గర్భ జలాల శాతం పెరుగుతుందన్నారు. ఇంకుడు గుంతలు లేని ఇల్లు మన మండలంలో కనిపించకుండా పంచాయతీ సర్పంచ్ లు ,కార్యదర్శులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యంజిఎన్ఆర్ ఈజియస్ ఏపివో సుధాకర్ ,సర్పంచ్ లు అప్పారావు , ఈశ్వరప్రగడ నాగభూషణం , సుశీల ,పగడాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగులకు 24% హెచ్‌ఆర్‌ఏ మంజూరు చేయాలి.!

- రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. కే రామారావు

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 27 మహా:** జీహెచ్ఎంసీ పరిధి నుండి 8 కిమీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 24% హెచ్ఆర్ఏ మంజూరు చేయాలని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. కే రామారావు, జిల్లా కలెక్టర్‌ను కోరారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)నుండి 8 కిమీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు 24% ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మంజూరు చేసే అంశాన్ని పరిశీలించి, ఆర్థిక శాఖ అనుమతి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ను ఉద్యోగ సంఘం విజ్ఞప్తి చేసింది. గతంలో జీహెచ్ఎంసీ నుండి 8 కిమీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు 24% హెచ్ఆర్ఏ వర్తింపజేసేందుకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ అనుమతి ఇచ్చినట్లు సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొనబడింది.

**ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం...**

ప్రభుత్వం జారీ చేసిన తదుపరి ఆదేశాల ప్రకారం, ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వులు లేకుండా ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ), నగర పరిహార భత్యం (సిసిఏ) లేదా ఇతర భత్యాల పెంపు, సవరణలకు అనుమతించరాదని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్, స్టేట్ ఆడిట్ డైరెక్టర్ మరియు పే అండ్ అకౌంట్స్ అధికారులకు సూచనలు జారీ చేయబడ్డాయి. ఈ నేపథ్యంలో, జీహెచ్ఎంసీ నుండి 8 కిమీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు 24% హెచ్ఆర్ఏ మంజూరు చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక అనుమతి పొందేందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ స్థాయిలో తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డాక్టర్ కే రామారావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, శ్రీనేష్ కుమార్ నోరి, నూతనకంటి వెంకట్, శాంతి శ్రీ,రేవతి, నర్సిరెడ్డి, రాకేష్, శ్రీనివాస్, , సైదమ్మ, అనిత, నాగేశ్వరావు, మహేష్, సూర్య జ్యోత్స్న, రాణి, ప్రమీల, రంగయ్య, గోపాల్ నాయక్, శ్రీధర్ రెడ్డి, శేఖర్, వాణి, గౌస్, తేజ, రాములు, మోహన్ తదితరులు పాల్గొన్నారు



# సర్కిల్ అభివృద్ధియే.. లక్ష్యంగా పనులను వేగవంతం చేయండి.

- పరిసరాలను స్వచ్ఛంగా, పరిశుభ్రత గా ఉంచండి.
- నాలా అభివృద్ధి పనులను వేగవంతం చేయండి.
- మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి.

**జవహర్ నగర్, మహా :** కీసర సర్కిల్ అభివృద్ధియే లక్ష్యంగా వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సర్కిల్ పరిధిలోని పరసరాలను స్వచ్చతగా పరిశుభ్రంగా ఉంచండని మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. యాప్రాల్, దమ్మాయిగూడ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ సిబ్బందితో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ ఉద్దేశాలకు అనుగుణంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి ఎదిగేలా కృషి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్కిల్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతూ అభివృద్ధిలో ముందంజలో ఉండడం ముదాబావమన్నారు. స్వచ్ఛత పరిశుభ్రతలో దేశానికే ఆదర్శంగా మల్కాజిగిరి కార్పొరేషన్ నిలుస్తుందని, పౌరులు తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి డస్ట్ బిన్లలో వేయాలని సూచించారు. శుభ్రత పరిశుభ్రత లో ఆరోగ్యకరమైన నిబంధనలు పాటించి ఆరోగ్య సమాజాన్ని నిర్మించాలని సూచించారు. అనంతరం యాప్రాల్, దమ్మైగూడ పరిధిలోని వివిధ ప్రాంతాలను పరిశీలించి నాలా అభివృద్ధి పనులు, జంక్షన్ అభివృద్ధి పనులు, స్వచ్ఛబడి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కీసర డిప్యూటీ కమిషనర్ రామలింగం, ఎస్ డబ్ల్యూ ఎం డిఈ, సంతోష్, మెయింటెనెన్స్ డి ఈ మాధవాచారి, పద్మలత, అనిల్, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# గాంధీ మార్గమే గ్రామ స్వరాజ్యానికి మార్గం

- గౌతమ బుద్ధుని కరుణ, చాణక్యుని సంకల్పంతో ముందుకు సాగుతున్న గాంధీ మార్గ్ సోషల్ మిషన్

**హైదరాబాద్, మహా :** సత్యం, అహింస, స్వావలంబన, కరుణ, జ్ఞానం ఆధారంగా గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేయాలని గాంధీ మార్గ్ సోషల్ మిషన్ (తాత్విక చింతన) సంకల్పించింది. భారతీయ యువతకు, ప్రజలకు మార్గదర్శకంగా నిలిచేందుకు గాంధీజీ సిద్ధాంతాలు, గౌతమ బుద్ధుని బోధనలు, చాణక్యుని కార్యదక్షతను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగనున్నట్లు సంస్థ అధ్యక్షుడు భగవతుల రవీంద్ర ప్రసాద్ తెలిపారు. గాంధీజీ సిద్ధాంతాలే ఆచరణ మార్గం మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సంస్థ పేర్కొంది. స్వావలంబన, గ్రామ స్వరాజ్యానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాల అభివృద్ధి గ్రామసభల నుంచే ప్రారంభం కావాలని అభిప్రాయపడింది. శ్రమకు గౌరవం ఇవ్వడం, వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, స్వయం సమృద్ధి గ్రామాల నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించింది. “గ్రామ స్వరాజ్యమే - రామరాజ్యం” అనే నినాదంతో గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సంకల్పించినట్లు తెలిపింది. బుద్ధుని కరుణ.. సమాజానికి శాంతి మార్గం గౌతమ బుద్ధుని కరుణ, సహనం, ద్వేషరహిత జీవన విధానం సమాజానికి ఎంతో అవసరమని సంస్థ అభిప్రాయపడింది. మత కలహాలు, అసూయ, ద్వేషాలకు దూరంగా ఉంటూ పరస్పర గౌరవం, ప్రేమ, సహనంతో జీవించాలని పిలుపునిచ్చింది. ప్రతి గ్రామంలో మానవతా విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తామని పేర్కొంది. ప్రతి గ్రామంలో జ్ఞాన కేంద్రం ఏర్పాటు లక్ష్యం చాణక్యుని దూరదృష్టి, వ్యూహాత్మక ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని యువతలో జ్ఞానం, కార్యదక్షతను పెంపొందించేందుకు కృషి చేస్తామని సంస్థ వెల్లడించింది. “ప్రతి గ్రామంలో ఒక జ్ఞాన కేంద్రాన్ని, ప్రతి యువతలో ఒక చాణక్యుని యుక్తిని, ప్రతి మనసులో ఒక బుద్ధుని కరుణను నింపే వరకు విశ్రమించము” అనే సంకల్పంతో ముందుకు సాగనున్నట్లు తెలిపింది. జ్ఞానంతో కూడిన సేవ, వివేకంతో కూడిన కరుణ సమాజ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొంది. విద్య, వ్యవసాయం, స్వధర్మం తదితర అంశాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. గ్రామ స్వరాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాలి గ్రామీణాభివృద్ధి, నైతిక విలువలు, స్వావలంబన, ప్రజల్లో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో చేపట్టనున్న ఈ ఉద్యమంలో ప్రజలు, యువత, రైతులు, విద్యావేత్తలు, ప్రజాస్వామ్యవాదులు, సాధువులు భాగస్వాములు కావాలని గాంధీ మార్గ్ సోషల్ మిషన్ అధ్యక్షుడు భగవతుల రవీంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు.

# పూల వ్యర్థాలతో విలువైన సేంద్రియ ఉత్పత్తులు

- 7,000 మెట్రిక్ టన్నుల పూల వ్యర్థాల సేకరణ.. అగరబత్తీలు, ధూప్ స్టిక్స్ తయారీకి వినియోగం
- పర్యావరణహిత వ్యర్థ నిర్వహణకు పక్కా ఆర్గానిక్స్‌తో ఎంఎంసీ భాగస్వామ్యం



**కుషాయిగూడ, మహా :** పండుగలు, మతపరమైన కార్యక్రమాల సందర్భంగా సేకరించిన పూల వ్యర్థాలను విలువైన సేంద్రియ ఉత్పత్తులుగా మార్చేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. పూల వ్యర్థాలను అగరబత్తీలు, ధూప్ స్టిక్స్ తయారీకి వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నట్లు ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

గణేష్ చతుర్థి, బతుకమ్మ పండుగల సందర్భంగా పెద్ద మొత్తంలో పూల వ్యర్థాలు ఉత్పత్తి కాగా, వాటిని సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి పునర్వినియోగ ప్రక్రియకు పంపించినట్లు వెల్లడించారు. ఈ విధానం ద్వారా మున్సిపల్ వ్యర్థాల నిర్వహణ పై భారం తగ్గడంతో పాటు వ్యర్థాలను ఉపయోగకరమైన వనరులుగా మార్చే అవకాశం కలిగిందన్నారు. 7,000 మెట్రిక్ టన్నుల పూల వ్యర్థాల సేకరణ ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 7,000 మెట్రిక్ టన్నుల పూల వ్యర్థాలను సేకరించినట్లు శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ తెలిపారు. ఇందులో గణేష్ నిమజ్జన వేడుకల సందర్భంగా 6,400 మెట్రిక్ టన్నులకు పైగా, బతుకమ్మ పండుగ సందర్భంగా సుమారు 400 మెట్రిక్ టన్నుల పూల వ్యర్థాలు ఉన్నట్లు వివరించారు.పక్కా ఆర్గానిక్స్‌తో భాగస్వామ్యంపక్కా ఆర్గానిక్స్ సంస్థ సహకారంతో ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద పూల వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కియోస్కలను ఏర్పాటు చేశారు. సఫిల్‌గూడ చెరువుతో పాటు ఇతర ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో మతపరమైన కార్యక్రమాలకు ఉపయోగించిన పూలను, గణేష్ విగ్రహాలతో పాటు వచ్చిన పూల వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించారు.అగరబత్తీలు, ధూప్ స్టిక్స్ తయారీసే కరించిన పూలను పక్కా ఆర్గానిక్స్ సంస్థ ఎండబెట్టి పొడిగా తయారు చేసింది. అనంతరం ఆ పొడిని వివిధ మూలికలు, సహజ రెసిన్లు, కలప పొడులు, మొక్కల ఆధారిత బైండర్లతో కలిపి అగరబత్తీలు, ధూప్ స్టిక్స్ వంటి ఉత్పత్తుల తయారీకి వినియోగించింది.

**వ్యర్థాల నుంచి వనరుల సృష్టి**

పూల వ్యర్థాలను ఉపయోగకరమైన సేంద్రియ ఉత్పత్తులుగా మార్చడం ద్వారా వ్యర్థాల విభజన, వనరుల పునర్వినియోగం, ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ హిత వ్యర్థ నిర్వహణకు ఎంఎంసీ ప్రాధాన్యతనిచ్చింది. వ్యర్థాలను సమస్యగా కాకుండా విలువైన వనరులుగా మార్చే ఇటువంటి కార్యక్రమాలు స్వచ్ఛమైన, సుస్థిర నగర నిర్మాణానికి దోహదపడతాయని అధికారులు తెలిపారు.







# అక్రమ బోర్లపై ఉక్కుపాదం ఎక్కడ?

- ఒక్కచోటే సీజ్.. మరోచోట అధికారుల మౌనం!
- ఇప్పటివరకు ఎన్ని బోర్లు సీజ్ చేశారు? లెక్కలతో సహా వివరాలు వెల్లడించాలని ఆర్టీఐ కార్యకర్త తాడూరి గగన్ కుమార్ డిమాండ్

**కుషాయిగూడ, మహా:** అక్రమ బోర్ల తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్న కాప్రా రెవెన్యూ అధికారులు ఆచరణలోనూ అదే స్థాయిలో వ్యవహరిస్తున్నారా? నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతున్న అధికారులు, మండలంలోని అన్ని ప్రాంతాల్లోనూ సమానంగా తనిఖీలు నిర్వహిస్తున్నారా? ఒకచోట అక్రమ బోరును సీజ్ చేసిన అధికారులు, మరోచోట వరుసగా బోర్లు వేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కాప్రా మండల పరిధిలోని చర్లపల్లి ప్రాంతం ఈసీ నగర్‌లో ఇటీవల అర్ధరాత్రి అనుమతులు లేకుండా వేసిన బోరును రెవెన్యూ అధికారులు సీజ్ చేయడం ఒకవైపు హర్షణీయం కాగా, మరోవైపు పద్మశాలి టౌన్‌షిప్‌లో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న బోర్ల తవ్వకాలపై అధికారుల వైఖరి విమర్శలకు తావిస్తోంది. ఈసీ నగర్‌లో అక్రమంగా బోర్ వేసినట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు సీజ్ చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అయితే కాప్రా మండల పరిధిలోని పద్మశాలి టౌన్‌షిప్‌లో శని, ఆది, సోమవారాల్లో వరుసగా బోర్లు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వ్యక్తి విచ్చలవిడిగా బోర్లు వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఇతర బోర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అధికారుల అండదండలు ఉన్నాయా? అనే అనుమానాలను సైతం వారు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలు ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. వీటిపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాల్సినప్పుడు, ఒక ప్రాంతంలో అక్రమ బోరును సీజ్ చేసి మరో ప్రాంతంలో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న తవ్వకాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనుమతులు తీసుకొని నిబంధనల ప్రకారం బోర్లు వేయాలనుకునే వారు ఒకవైపు ఉంటే, ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్నారనే ఆరోపణలు మరోవైపు రావడం ఆందోళన కలిగిస్తోంది. పద్మశాలి టౌన్‌షిప్‌లో జరుగుతున్న తవ్వకాలపై అధికారులు తక్షణమే దృష్టి సారించి, అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఎవరికైనా ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నారనే అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు. కాప్రా మండల పరిధిలో అక్రమ బోర్లపై అధికారులు ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని బోర్లను అక్రమంగా గుర్తించారు? వాటిలో ఎన్ని బోర్లను సీజ్ చేశారు? ఏయే కాలనీల్లో చర్యలు చేపట్టారు? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఒక్క ఈసీ నగర్‌లో బోరును సీజ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, మండలవ్యాప్తంగా జరిగిన తవ్వకాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. సీజ్ చేసిన బోర్ల సంఖ్య, తనిఖీలు నిర్వహించిన ప్రాంతాలు, తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచితేనే అధికారుల చర్యలపై స్పష్టత వస్తుందని పేర్కొంటున్నారు. బోర్ల తవ్వకాలకు సంబంధించి వర్తించే నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. భూగర్భ జలాల వినియోగం, నీటి వనరుల పరిరక్షణ దృష్ట్యా బోర్ల తవ్వకాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. పద్మశాలి టౌన్‌షిప్‌లో బోర్లు వేస్తున్నారనే ఆరోపణలపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, అనుమతుల వివరాలను తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ తవ్వకాలకు ఎవరైనా సహకరిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవాలు ఉంటే వాటిని కూడా విచారణ ద్వారా తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఈసీ నగర్‌లో రెవెన్యూ అధికారులు చేపట్టిన సీజ్ చర్యలను స్వాగతిస్తూనే, పద్మశాలి టౌన్‌షిప్‌లో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న బోర్ల తవ్వకాలపై కూడా అదే కఠిన వైఖరి అవలంబించాలని ఆర్టీఐ కార్యకర్త తాడూరి గగన్ కుమార్ కోరుతున్నారు. ఇప్పటివరకు ఎన్ని అక్రమ బోర్లను సీజ్ చేశారో, ఎన్ని ఫిర్యాదులు అందాయో, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పడమే కాకుండా, ఆ చర్యలకు సంబంధించిన లెక్కలను కూడా ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు. పద్మశాలి టౌన్‌షిప్‌లోని ఆరోపణలపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? ఇప్పటివరకు ఎన్ని బోర్లు సీజ్ చేశారనే వివరాలు ఎప్పుడు వెల్లడిస్తారు? అనే ప్రశ్నలకు కాప్రా రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేపడతారా లేదా అనేది వేచి చూడాలి.



# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కాలుష్యంపై ఈటల రాజేందర్ గళం శాశ్వత పరిష్కారం వరకు పోరాటం

**ఘట్కేసర్ అక్టోబర్ 27 మహా :** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కాలుష్యంతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారని, డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే విషపూరిత లీచేట్ నీరు నేరుగా చెరువులు, కాలువల్లోకి వెళ్లి భూగర్భ జలాలను పూర్తిగా కలుషితం చేస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ పరిధిలోని ఎదులాబాద్ గ్రామం నుంచి ప్రారంభించిన 50 కిలోమీటర్ల 4 రోజుల పాదయాత్రలో లక్ష్మీ నారాయణ పెద్ద చెరువును సందర్శించగా, కలుషిత నీటితో మత్స్య సంపద పూర్తిగా నాశనమైందని, ఉపాధి కోల్పోయామని మత్స్యకారులు ఆయనకు కన్నీటి పర్యంతమయ్యారు, గాలి కాలుష్యంతో శ్వాసకోశ, చర్మ వ్యాధులు, కలుషిత నీరు తాగి కిడ్నీ, క్యాన్సర్ బారిన వందలాది మంది పడుతున్నారని, పశువులు కూడా చనిపోతున్నాయని తెలిపారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఈ డంపింగ్ యార్డ్‌పై కేసులు వేసి పోరాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు సీఎం అయ్యాక మౌనంగా ఉండటం ఏంటని ప్రశ్నించిన ఈటల, ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యర్థాలతో విద్యుత్, సేంద్రియ ఎరువుల తయారీకి ఆధునిక టెక్నాలజీతో డీపీఆర్ సిద్ధం చేయాలని, జనావాసాలకు దూరంగా కాలుష్యరహిత డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించి, కలుషిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు, ఆరోగ్య సర్వే చేసి బాధితులకు ఉచిత వైద్యం ఇవ్వాలని కోరిన ఈటల, ఎదులాబాద్ నుంచి మొదలైన ఈ పాదయాత్ర వివిధ గ్రామాలు, కాలనీల మీదుగా సాగి జవహర్ నగర్‌లో భారీ బహిరంగ సభతో ముగుస్తుందని, శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటం ఆగదని, అవసరమైతే మరింత తీవ్ర ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.

# పెద్దకల్వాల, తుర్కలమద్దికుంట, కనుకుల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వాల, తుర్కలమద్దికుంట గ్రామాలతో పాటు సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా రైతులు తమ వరి ధాన్యాన్ని విక్రయించేందుకు అవకాశం కల్పించనున్నారు. రైతులకు ధాన్యం విక్రయాల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది అని తెలిపారు.

# ఉద్యమకారులకు ఇళ్లపట్టాలు ఇబ్రహీంపట్నం నుంచే శ్రీకారం...

- జీవో వచ్చిన 24గంటల్లో స్థలాలు చూపించే బాధ్యత నాది.
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి
- తొర్రూర్‌లో తెలంగాణ ఉద్యమకారుల 'అలయ్ బలయ్'
- కేసీఆర్ ఒక్కరు కాదు.. ఎందరో పోరాడితే రాష్ట్రం వచ్చిందన్న మల్‌రెడ్డి
- ఈ దఫా ఇళ్ల పట్టాలు... మళ్లీ గెలిచాక ఉద్యమకారులకు గృహనిర్మాణం
- ఈ సారి 80వేల మెజార్టీతో గెలుస్తానన్న మల్‌రెడ్డి రంగారెడ్డి



**ఆదిభట్ల అక్టోబర్ 27 మహా:** హైలెవెల్ కమిటీ నిర్ణయం మేరకు జీవో వచ్చిన 24 గంటల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారు స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యమకారులందరికీ వారు కోరిన చోట ఇంటిస్థలం చూపించే బాధ్యత తనదని చెప్పారు. తొర్రూర్‌లో మంగళవారం రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్‌రెడ్డి హాజరయ్యారు.

**కేసీఆర్ ఒక్కరితోనే తెలంగాణ రాలేదు...**

కేసీఆర్ ఒక్కరితోనే తెలంగాణ రాలేదని...ఎంతో మంది త్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం వచ్చినట్లు మల్‌రెడ్డి తెలిపారు. ఏ లక్ష్యంతోనైతే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందో... పదేళ్లలో అది నెరవేరకుండా, ఒక్క కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. కబ్జాలు, లంచాలతో కొందరు దోచుకొని, రాష్ట్రాన్ని మాత్రం ఆగం చేశారన్నారు. ఉద్యమలక్ష్యం నెరవేర్చేందుకే పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీలాంటి నిర్ణయాలు ప్రజాప్రభుత్వం తీసుకున్నట్లు చెప్పారు.

**తెలంగాణ కోసం పోరాడిన వారికే....**

తెలంగాణ కోసం పోరాడిన వారికి పదేళ్లలో ఎలాంటి గుర్తింపు లభించలేదన్న మల్‌రెడ్డి... ఉద్యమకారులందరికీ ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకే హైలెవెల్ కమిటీ వేసినట్లు చెప్పారు. జీవో వచ్చిన 24గంటల్లో నియోజకవర్గంలో ఉద్యమకారులకు స్థలాలు చూపించే బాధ్యత తనదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న మల్‌రెడ్డి రంగారెడ్డి... తాను 80 వేల మెజార్టీతో గెలువకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. ఈ దఫా ఇళ్లపట్టాలిస్తామని... మళ్లీ గెలిచాక ఉద్యమకారులందరికీ గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పారు.



# తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సమీక్ష

- అన్ని డివిజన్లలో నీటి సరఫరా మెరుగుపరచాలి
- జలమండలి అధికారులకు బండారి లక్ష్మారెడ్డి సూచన

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, పైప్‌లైన్ లీకేజీలు, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, పెండింగ్ పనుల పురోగతిపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత సమయాల్లో తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. పాత పైప్‌లైన్ల మరమ్మతులు, లీకేజీల నివారణ, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. పెండింగ్ పనులను గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల తీవ్రతను అంచనా వేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంలో జలమండలి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని పేర్కొన్నారు.




# మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

**పెద్దపల్లి మహా :** మహిళలు, విద్యార్థుల భద్రతపై అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి షీ టీమ్ సభ్యులు సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఎం. లావణ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రంగంపల్లిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ.. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోక్సో చట్టం, పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావం, విద్యార్థుల ప్రవర్తనా నియమాలు, యుక్తవయస్సులో చోటుచేసుకునే శారీరక, మానసిక మార్పులు, ఈ దశలో తల్లిదండ్రుల బాధ్యతల గురించి వివరించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, జనసమ్మర్ధ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను తెలియజేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మహిళలకు ప్రమాదం ఎదురైనా, ఎవరైనా బెదిరింపులకు గురిచేసినా వెంటనే 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ప్రయాణ సమయాల్లో మహిళలు తమ భద్రత కోసం టీసేఫ్ (TSafe) యాప్‌ను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ డైరెక్టర్ సీహెచ్. వెంకటేష్, మల్లయ్య, షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# మల్లికార్జున్ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

**మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్**

**జవహర్ నగర్, మహా:** జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కాలనీ కమిటీ ప్రతినిధులు కోరారు. కాలనీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె. బాలు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సోమవారం జవహర్ నగర్ మాజీ మేయర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె. బాలు మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన తమ కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి, అభినందించిన మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న తమ కమిటీకి ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ మేయర్ హామీ ఇచ్చారని వెల్లడించారు. కాలనీలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారన్నారు. అలాగే, కాలనీ కమిటీ సభ్యులందరూ ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించి, ప్రజల మన్ననలు పొందాలని మాజీ మేయర్ సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కోశాధికారి జలంధర్, సలహాదారులు వెంకటేష్, మహేష్, సారమ్మ, ఈశ్వర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దకల్వాల, తుర్కలమద్దికుంట, కనుకుల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వాల, తుర్కలమద్దికుంట గ్రామాలతో పాటు సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా రైతులు తమ వరి ధాన్యాన్ని విక్రయించేందుకు అవకాశం కల్పించనున్నారు. రైతులకు ధాన్యం విక్రయాల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది అని తెలిపారు.



# పిల్లలకూ నిషేధిత ఈసిగరెట్ల విక్రయం

- రూ.10 కోట్ల నెట్‌వర్క్‌పై దర్యాప్తు
- సైనిక్‌పురిలో ఈగల్ ఫోర్స్,
- కుషాయిగూడ పోలీసుల సంయుక్త దాడి
- 39 ఈ-సిగరెట్లు స్వాధీనం, ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**కుషాయిగూడ, మహా :** సైనిక్‌పురిలో నిషేధిత ఎలక్ట్రానిక్ సిగరెట్ల విక్రయాలపై ఈగల్ ఫోర్స్, కుషాయిగూడ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 39 నిషేధిత ఈసిగరెట్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు మైనర్లకు సైతం ఈసిగరెట్లు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో భాగంగా వాట్సాప్ ద్వారా ఆర్డర్లు స్వీకరించి, ఫోన్‌పే ద్వారా చెల్లింపులు తీసుకుంటూ, రవాణా సేవల ద్వారా వినియోగదారులకు ఈసిగరెట్లను సరఫరా చేస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి కేరళ, కర్ణాటక రాష్ట్రాలతోనూ సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌కు సంబంధించి రూ.10 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించడంతో, ఆర్థిక లావాదేవీలు, సరఫరా మార్గాలు, విక్రయాల్లో పాల్గొన్న ఇతర వ్యక్తుల వివరాలపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈసిగరెట్ల సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో వెలికితీసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.



# రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించాలి: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**నీటి పొదుపు, చెరువుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**పెద్దపల్లి మహా :** గోదావరిఖని: ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయాలని రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు.గోదావరిఖనిలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, చెరువులు, కుంటలను సంరక్షించడం, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు వివరించాలని కోరారు. ఎస్ఆర్ఎస్పీ నుంచి 4.5 టీఎంసీల నీటిని విడుదల చేసిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి సంబంధిత పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించకూడదని, ఎల్‌నినోపై ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలకు రాజకీయ కోణంలో స్పందించారు.పెద్దపల్లి జిల్లాకు ఎలాంటి నష్టం కలగకుండా రైతులకు, ప్రజలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో కలిసి అవసరమైన చర్యలకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి. రామగుండం నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, ఒక్కో గ్రామానికి సుమారు 130 ఇళ్ల వరకు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ చేరేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రహదారుల నిర్మాణంతో పాటు పంచాయతీరాజ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల సొమ్మేనని, నిధులు ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకే వినియోగించేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. "ప్రజల సంక్షేమం, రైతుల భద్రత, గ్రామాల అభివృద్ధే మా లక్ష్యం. ప్రతి గ్రామానికి వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తాను" అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమలతో పాటు పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నాకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ, బీఎస్పీ నాయకుల మద్దతు

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లాలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఉద్యోగులకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకుడు గుండావేణ స్వామి మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు వ్యవస్థ ఉండదంటూ హామీలు ఇచ్చి ఉద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని, గర్భిణుల ప్రసవాల సంఖ్య పెరగడంలోనూ వారి సేవలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినట్లుగానే తెలంగాణలోనూ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వారికి అండగా ఉంటుందని గుండావేణ స్వామి స్పష్టం చేశారు.

## చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ, పునరావాసం కల్పిస్తాం

- **రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
- **ప్రజలకు ఇచ్చిన హామీ**
- **మేరకు గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం**
- **7 రోజుల్లో సామాజిక ప్రభావ అంచనా సర్వే పూర్తి.. 8 ప్రత్యేక బృందాల ఏర్పాటు**
- **3 నుంచి 4 నెలల్లో భూసేకరణ, పరిహారం, పునరావాస ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు**

**పెద్దపల్లి మహా, :** ధర్మారం: చామనపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాసం, పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) ప్యాకేజీ అమలు చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మారం మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన గ్రామసభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, గత అనేక సంవత్సరాలుగా భారీ వర్షాలు కురిసినప్పుడు, నీటిని ఎత్తిపోసే సమయంలో చామనపల్లి గ్రామ ప్రజలు ముంపు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తెలిపారు. 2006లో ధర్మారం మండలం నుంచి జడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, ఈ ప్రాంతంలోని గ్రామాలతో తనకు సుమారు 25 సంవత్సరాల అనుబంధం ఉందని పేర్కొన్నారు. సాధారణంగా నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) నుంచి 100 మీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, చామనపల్లి గ్రామ ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని తొలిసారిగా ఆ పరిమితికి మించి గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు బలోపేతంలో భాగంగా నంది మేడారం చెరువు బలోపేతం చేపట్టిన నేపథ్యంలో చామనపల్లి గ్రామ ప్రజలు తమ గ్రామానికి భూసేకరణ చేపట్టి పునరావాసం కల్పించాలని కోరారని తెలిపారు.ఈ అంశాన్ని పరిశీలించేందుకు 2023లో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. ఎఫ్‌టీఎల్ నుంచి 100 మీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టి పునరావాసం కల్పించాలని కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని తెలిపారు. అయితే, ప్రస్తుతం ప్రభుత్వం చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని ఆదేశించిందని స్పష్టం చేశారు.ఈ గ్రామసభలో , ఆర్డీవో బి. గంగయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.



## గ్రామాల్లో ఉపాధి కల్పనకు పెద్దపీట..

**పెండింగ్ పనులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష కీలక ఆదేశాలు**

**పెద్దపల్లి మహా :** జిల్లాలో వీబీ జీ రామ్ జీ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పథకం అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పథకం కింద ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, బోర్‌వెల్ రీఛార్జ్ పిట్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, నీటి లీకేజీలను అరికట్టి ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆర్యజనని కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా:** గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు, వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీల కొరకు నిర్వహించిన ఆర్యజనని కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. తల్లి బిడ్డల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం శ్రీ రామకృష్ణ సేవా సమితి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఆరోగ్యవంతమైన తల్లి ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తుందని, నేటి పిల్లలే రేపటి సమాజానికి మార్గదర్శకులని అన్నారు. అదేవిధంగా, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను తమ సొంత పిల్లలుగా భావిస్తూ ఎంతో ప్రేమతో, బాధ్యతతో సంరక్షిస్తున్న




అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తూ, వారి ఆరోగ్యం ఎదుగుదల పట్ల శ్రద్ధ చూపడం అభినందనీయమని అన్నారు. చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు.





# ఓట్ బచావో.. దేశ్ బచావో

- **ఏఐసీసీ నాయకుల పిలుపు**
- **ఆదిలాబాద్ పట్టణంలో సమావేశం**
- **శ్రేణులకు పలు సూచనలు**
- **ఓటు రాజ్యాంగ హక్కు కాపాడుకోవడం మన బాధ్యత**
- **కంది మౌనా శ్రీనవాస రెడ్డి పిలుపు**



**ఆదిలాబాద్ మహా :** ఓటు కాపాడటం ప్రజాస్వామ్యవిలువలను రక్షించడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య లక్ష్యమని ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్ అన్నారు. పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓట్ బచావో, దేశ్ బచావో అభియాన్ కార్యక్రమానికి ఆయన కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలగాలంటే ఓటరు జాబితాల రూపకల్పన, సవరణ ప్రక్రియలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడటం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కీలకమని తెలిపారు. సిఈసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ప్రజాస్వామ్య బద్ధమైనదని అన్నారు. జ్ఞానేష్ కుమార్ కొన్ని కోట్ల ప్రజల ఓటు హక్కును ప్రమాదంలోకి నెట్టివేసారని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ బిజెపి ప్రభుత్వ తొత్తు గా పనిచేస్తున్నారని అందుకే మోడీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ను కాపాడుతున్నారని ఆరోపించారు. ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ఓటరు హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ 2 లు, కాంగ్రెస్ పార్టీని నియమించిన ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్లు నోటీసులు వచ్చిన ఓటర్లకు అవసరమైన సహకారాన్ని అందిస్తూ వారి ఓటు హక్కుకు పోకుండా కాపాడే ప్రయత్నం చేయాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ జాదవ్ మాట్లాడుతూ, దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, ప్రజాస్వామ్యవాదుల ఓట్లను తొలగించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు వేసే అవకాశం కల్పించడం ఎన్నికల వ్యవస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాలో పేరు లేకపోవడం వల్ల ఏ ఒక్క అర్హుడూ తన ప్రజాస్వామ్య హక్కును కోల్పోకూడదని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ .. ఓటు రాజ్యాంగం మన కిచ్చిన హక్కు అని తొలగించిన ఓట్ల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బీఎల్ఏ 2 లు బూత్ స్థాయిలో అనామలిస్ ఓటర్ల వివరాలను సేకరించి పార్టీ ఆఫీస్ లో అందించాలని కోరారు. వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ఓటు పరిక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ నిరసనకు మద్దతుగా మనమందరం చలో ఢిల్లీ కార్యక్రమం లో పాల్గొందామని పిలుపునిచ్చారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను ఆ పదవి నుండి తొలగించేవరకు పోరాటం చేయాలని అన్నారు. ఓటరు హక్కుల పరిరక్షణ కోసం మనమంతా సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి ఓటరు తన హక్కును వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గం అబ్జర్వర్ జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి ,బోత్ నియోజక వర్గం ఇంచార్జ్ ఆడే గజేందర్ ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య ,ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ , ఆదిలాబాద్, బోథ్ ,మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచు శ్రీకాంత్ రెడ్డి , మల్లెపూల సత్య నారాయణ,మాజీ డీసీసీబీ చైర్మన్లు అడ్డి భోజారెడ్డి , ముడుపు దామోదర్ రెడ్డి, నాయకులు సాజిద్ ఖాన్ అల్లూరి సంజీవరెడ్డి ,గోక గణేశ్ రెడ్డి ,పరమేశ్వర్ ,దుర్గం శేఖర్ ,కొడాల నారాయణ , పసుల చంటి గుడిపల్లి నగేష్ ,సామా రూపేష్ రెడ్డి ,మునిగేలా నర్సింగ్ , డేరా కృష్ణా రెడ్డి ,జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పోకెన్ ఇంగ్లీష్ పై విద్యార్థులకు పోటీ

**ధైర్యంగా మాట్లాడాలని కలెక్టర్ పిలుపు**
**విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం**

**ఆదిలాబాద్ మహా:** విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్ రివ్యూ మీటింగ్ కమ్ కాంపిటీషన్స్'ను మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషా సంభాషణ నైపుణ్యాలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఇంగ్లీష్‌లో ధైర్యంగా, స్పష్టంగా మాట్లాడేలా



ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ బోధనను సమర్థవంతంగా అమలు చేస్తూ, విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఉన్న భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం వివిధ అంశాల్లో స్పోకెన్ ఇంగ్లీష్ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించి, మరింతగా రాణించాలని ప్రోత్సహించారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో ఆరోగ్య పాఠశాల జిల్లా కోఆర్డినేటర్ అజయ్, స్కూల్ అసిస్టెంట్లు రఘునాథ్, బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ఒకటవ డివిజన్‌లో 33 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేటర్**

**పెద్దపల్లి మహా :** రామగుండం: నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటవ డివిజన్‌కు చెందిన 33 మంది నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ లెటర్లను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మంగళవారం ఎన్టీపీసీ కాకతీయ కళ్యాణ మండపంలో అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డివిజన్‌లోని దినసరి కూలీలు, పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేసినట్లు విజయ మల్లేష్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ఇళ్ల మంజూరుతో పేదల సొంతింటి కల నెరవేరడం ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, జిల్లా పీడీ, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## అయ్యప్ప మాల ధరించి శబరిమలైకు పాదయాత్ర

**క్యాతనపల్లి మహా :** రామకృష్ణాపూర్‌కు చెందిన చంద్రగిరి రమేష్ కన్నా అయ్యప్ప స్వామి మాల ధరించి శబరిమలైకు పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక శ్రీ కోదండ రామాలయంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో పూజారి శరత్ మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ, కన్నా స్వామి ఇప్పటివరకు ఆరుసార్లు పాదయాత్రగా శబరిమలై చేరుకొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. ఈసారి కూడా ఆయన పాదయాత్ర విజయవంతంగా పూర్తిచేసుకొని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పెద్దపల్లి ఉప్పలయ్య, రమేష్, అమర్నాథ్ రెడ్డి, నటరాజ్, బద్రి సతీష్, కమిటీ సభ్యులు మణికుమార్, గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.



## ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన

**పెద్దపల్లి మహా, :** ఓదెల : మండలంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో రూ.15 కోట్ల వ్యయంతో చేపడుతున్న పునర్నిర్మాణ పనులతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించారు.



## విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్ల తరలింపు పూర్తి చేయాలి

- **పెండింగ్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి**
- **మసీదు చౌరస్తా నుంచి లింగాపూర్ రోడ్డు వరకు పనులను పరిశీలించిన**
- **కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి మహా :** రామగుండం: రామగుండంలో మసీదు చౌరస్తా నుంచి లింగాపూర్ రోడ్డు వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్లను రెండు వారాల్లోగా తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి కలెక్టర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న తాగునీటి పైప్‌లైన్లు, జెన్‌కో, డిస్కం విద్యుత్ స్తంభాల తరలింపు పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్‌తో గంటా రాములు యాదవ్ మర్యాదపూర్వక భేటీ

**పెద్దపల్లి మహా :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను పెద్దపల్లి జిల్లా ఓదెల మండల మాజీ జెడ్పీటీసీ గంటా రాములు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌తో భేటీ అయ్యి ఆత్మీయంగా మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న గంటా రాములు యాదవ్ కేటీఆర్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మర్యాదపూర్వక భేటీకి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## పోలీస్ అమరవీరుల స్మరణలో కొవ్వొత్తుల ర్యాలీ

**పెద్దపల్లి మహా,** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ పోత్కపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తూ వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా "జోహార్ పోలీస్ అమరవీరులకు" అంటూ నినాదాలు చేశారు.



# పోలీస్ వ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన

**వన్ టౌన్ స్టేషన్ లో ఓపెన్ హౌజ్ నిర్వహణ**
**పలు విషయాలు వివరించిన ఎస్పీ**

**ఆదిలాబాద్ మహా:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వాహణపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించి విద్యార్థులకు పలు విషయాలను వివరించారు. పట్టణంలోని పలు ప్రైవేటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోలీసు విధులపై, పనిముట్లపై, సాంకేతిక పరిజ్ఞానంపై, వేలిముద్రలను కనుగొనే విధానాలపై విద్యార్థులకు ఎస్పీ సవివరంగా వివరించారు. పోలీసు అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను తెలిపారు. పోలీసులంటే భయం కాకుండా గౌరవంతో వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా ఆపద సమయంలోనైనా పోలీసులను సంప్రదించి పోలీసు సహాయాన్ని పొందాలని తెలిపారు. పోలీసు వ్యవస్థ ప్రజల రక్షణకై భద్రతకై 24 గంటల సేవలందిస్తు ఉంటుందని తెలిపారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ, వారు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, వారం రోజులు పాటుగా చేసే ఈ ప్రజాహిత కార్యక్రమాలలో ప్రజలు విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి పోలీసు అమరవీరులు చేసిన ప్రాణ త్యాగాల ఫలితమేనని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ కార్యాలయాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని పోలీస్ స్టేషన్ నిర్వహణపై పోలీసుల విధులపై చక్కటి అంశాలను నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఎస్ఐలు అశోక్, నాగనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జైదీపావళి లోపు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**మందమర్రి, మహా :** దీపావళి లోపు ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. మంగళవారం మందమర్రిలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు ఎస్. వెంకటస్వామి యూనియన్ జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి గని కార్మికులను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క దసరా సందర్భంగా కార్మికులకు సొంతింటి కల, అలవెన్సులపై ఆదాయపు పన్ను మాఫీ, మారుపేర్ల సమస్య పరిష్కారం, డిపెండెంట్లకు ఉద్యోగాలు వంటి హామీలు ఇచ్చారని, వాటిని దీపావళి లోపు అమలు చేయాలన్నారు. సొంతింటి కల కోసం ఎదురుచూసి రిటైర్ అయిన కార్మికులు చాలా మంది ఉన్నారని, ఈ దీపావళికి సొంతింటి కలను నెరవేర్చి కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. గత నాలుగేళ్లుగా వినతిపత్రాలు, ఆమరణ నిరాహార దీక్షలు, బ్యాలెట్ ఓటింగ్ ద్వారా పోరాటాలు చేస్తున్నామని, ఇక అమలు ఆలస్యమైతే మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా సంస్థకు రావాల్సిన బకాయిలు విడుదల చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని, రాజకీయ జోక్యంతో సంస్థను దెబ్బతీస్తే ఊరుకోబోమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కొత్త గనుల్లో సింగరేణి కార్మికులకే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డును ఏరియాలోనే నిర్వహించాలని, ఇన్ వాలిడేషన్ శాతం పెంచాలని, ఈ నెలలో ఇప్పటివరకు మెడికల్ బోర్డు నిర్వహించలేదని విమర్శించారు. ఒకసారి మెడికల్ కు వచ్చిన వారు మళ్లీ రావాలంటే ఏడాది ఆగాలనే నిబంధనను సవరించాలని, సర్ఫేస్ లో తాత్కాలికంగా పనిచేస్తున్న వారికి ఆరోగ్య పరిస్థితిని బట్టి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. 12వ వేతన కమిటీ ఏర్పాటుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలని, లేకుంటే అన్ని సంఘాలతో కలిసి దీర్ఘకాలిక పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు లింగాల సత్యనారాయణ, మైన్ ఇంచార్జి జడల ప్రవీణ్, పిట్ సెక్రటరీ రేగుల శ్రీనివాస్, కాంపల్లి నాగరాజు, అశోక్, శ్రీకాంత్, గని కార్మికులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల సాధనకు..

- కొమురం భీమ్ పోరాటం స్పూర్తిదాయకం
- గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, మహా :** ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం ప్రతిపత్తి కోసం కొమురం భీమ్ సాగించిన పోరాటం తరతరాలకు స్పూర్తిదాయకమని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మణుగూరులోని అంబేద్కర్ సెంటర్‌లో కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్ -జంగల్ -జమీన్ నినాదంతో అడవి, భూమి, నీటిపై ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీమ్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కొమురం భీమ్ ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి వ్యాప్తంగా "భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ని"

# మరింత బలోపేతం చేద్దాం

- సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ కొరకు ప్రతి ఏడాది ప్రత్యేక బడ్జెట్
- జిఎం(పర్సనల్) వెల్ఫేర్ కే.అజయ్ కుమార్
- భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక
- చిల్డ్రన్ పార్కులో సందడిగా జరిగిన కార్యక్రమం




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ని సింగరేణి వ్యాప్తంగా మరింత బలోపేతం చేద్దామని జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ కే.అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆదేశాల మేరకు సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి చిల్డ్రన్స్ పార్క్ లో గల సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ నందు జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ కే.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముందుగా కే.అజయ్ కుమార్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా గల అన్ని ఏరియాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ని బలోపేతం చేయటానికి, సింగరేణి సంస్థ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ కొరకు ప్రతి ఏడాది ప్రత్యేక బడ్జెట్ ను కేటాయిస్తుందని తెలిపారు. సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ప్రారంభం నుండి ఇప్పటివరకు 14 రాష్ట్రపతి స్కౌట్ అవార్డులు, 1325 స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజ్యపురస్కార్ గవర్నర్ అవార్డులు పొందారని వివరించారు. అనంతరం నూతనల ఎన్నిక అయిన కౌన్సిల్ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ అందరూ కలిసి కట్టుగా సింగరేణి వ్యాప్తంగా గల అన్ని ఏరియాలలో డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ కే.అజయ్ కుమార్, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) అండ్ సెక్రెటరీ ఎస్‌సిఈఎస్ జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవరావు, డివైపిఎంలు వి.అనీల్ కుమార్, కే.సునీల్ కుమార్, కే.శివ కుమార్, సీనియర్ పిఓ మండల శ్రీనివాస్, ఏఎస్ఓసి ఎస్.వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ పిఏకే.వరప్రసాద్, యూనిట్ లీడర్లు, స్కౌట్ మాస్టర్స్, రోవర్ స్కౌట్ లీడర్స్, రెంజర్ టిమ్ లీడర్లు, రోవర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

**కొత్త కమిటీ ఇలా**

సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక జరిగింది. సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అండ్ ప్యాట్రన్ చైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, వైస్ ప్రెసిడెంట్స్ డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి..సూర్యనారాయణ, డైరక్టర్(పి అండ్ పి)కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(ఈ అండ్ ఎం)ఎం.తిరుమల రావు, చీఫ్ కమీషనర్ డైరక్టర్(పా)గౌతమ్ పొట్రు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ కే.అజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ కమిషనర్(రోవర్స్) జి ఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం జి.వి.కిరణ్ కుమార్, డిస్ట్రిక్ట్ కమిషనర్(స్కౌట్స్) జిఎం(పర్సనల్) అండ్ సెక్రెటరీ ఎస్‌సిఈఎస్ జి.రాజేంద్రప్రసాద్, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ సింగరేణి ఉమెన్స్ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.శారద, డిస్ట్రిక్ట్ కమిషనర్(అడల్ట్) డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవరావు, డిస్ట్రిక్ట్ ట్రెసరర్ జిఎం(ఫైనాన్స్) సిహెచ్. మురళీధర్, అసిస్టంట్ డిస్ట్రిక్ట్ కమిషనర్(కార్పొరేట్) సీనియర్ పిఓ మండల శ్రీనివాస్, అసిస్టంట్ డిస్ట్రిక్ట్ కమిషనర్(అన్ని ఏరియాలు) ఏరియా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు ఉన్నారు.

# సుశీ క్యాంపు కార్మికులకు బోనస్ ఊరట

- విధులు బహిష్కరించి ఆందోళన.. మేనేజ్‌మెంట్‌తో చర్చలతో కొలిక్కి వచ్చిన సమస్య
- సుమారు 2 వేల మంది కార్మికుల ఖాతాల్లో రూ.5,500 చొప్పన జమ

**సత్తుపల్లి, అక్టోబరు 27: మహా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దసరా బోనస్ చెల్లింపుల కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి సింగరేణి సుశీ క్యాంపు కార్మికులకు ఊరట లభించింది. బోనస్ అందక విధులు బహిష్కరించి ఆందోళనకు దిగిన కార్మికుల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. కార్మిక సంఘాల నాయకులు మేనేజ్‌మెంట్‌తో జరిపిన చర్చలు ఫలించడంతో సుమారు 2 వేల మంది కార్మికులకు మంగళవారం బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ నగదు జమ అయింది. దీంతో కార్మికులు ఆందోళన విరమించి తిరిగి విధుల్లో చేరారు.

**బోనస్ కోసం విధుల బహిష్కరణ**

దసరా పండుగ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున బోనస్ చెల్లించాలని స్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌తో పాటు కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం బోనస్ చెల్లింపునకు హామీ ఇచ్చింది. అయితే సుశీ క్యాంపులో పనిచేస్తున్న కార్మికుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ విధులను బహిష్కరించారు.

**చర్చలతో పరిష్కారం**

కార్మికుల ఆందోళన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ సూచన మేరకు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ డా. జనక్ ప్రసాద్ ఆదేశాలతో ఐఎన్‌టీయూసీ సత్తుపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు కార్మికుల వద్దకు చేరుకున్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్‌తో కలిసి సుశీ క్యాంపు మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపారు. బోనస్ చెల్లింపులో నెలకొన్న జాప్యాన్ని పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. దీంతో కార్మికుల ఖాతాల్లో బోనస్ నగదు జమ కావడంతో సమస్య సద్దుమణిగింది.

**కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి**

కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సత్తుపల్లి ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు సూచించారు. కార్మికుల న్యాయమైన హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ సహకారం, డా. జనక్ ప్రసాద్ మార్గదర్శకత్వంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పురోగతికి సహకరిస్తూనే కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. బోనస్ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్, డా. జనక్ ప్రసాద్, కోటేశ్వరరావు, సముద్రాల సుధాకర్‌లకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు నరసింహారావు, సుశీ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వ్యర్థాలను వేరు చేద్దాం..పర్యావరణను రక్షిద్దాం

**మోడ్రన్ ఇక్రా స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వ్యర్థాలను వేరుచేసి పర్యావరణను రక్షిద్దామని మోడ్రన్ ఇక్కడ స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. విద్యార్థులకు మన చుట్టూ పక్కల ఉన్న వారికి ఈ వ్యర్థాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టాలను వివరిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా మంగళవారం కొత్తగూడెం కార్పోరేషన్ పన్నెండవ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్ రామవరంలోని మోడ్రన్ ఇక్రా పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈ వ్యర్థాల నష్టాల పోస్టర్ పెయింటింగ్ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఈ వ్యవర్థాల వలన భవిష్యత్తులో భూమి మీద ఉన్న ప్రాణికోటికి జరుగబోయే నష్టాలను వివరించారు. ముఖ్యంగా అనవసరంగా వచ్చిన ప్రతి కొత్త మోడళ్లు కోవడం వల్ల పాత ఈ వ్యర్థాలు పెరిగిపోయాయని పాడైన వాటిని తిరిగి ఉపయోగించే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ వ్యర్థాలు భూమిలో వేల సంవత్సరాల వరకు అలాగే ఉండిపోయి భూమి నీరు గాలిని కలుషితం చేస్తాయని అన్నారు. రాబోయే తరాలకు మనం అందించే ఆస్తి కలుషితం లేని గాలి పచ్చని చెట్లు మాత్రమే అని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ పరిసరాల్లో ర్యాలీ నిర్వహించి చుట్టూ పక్కల వారికి పర్యావరణ పరిరక్షణ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు ప్రసన్న, నాజీయా, సరస్వతీ, నుసరత్, సల్మా జాఫర్, ఖాజా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు..

# సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

- ఇల్లందులో జరిగే రాష్ట్రస్థాయి జనరల్ బాడీని జయప్రదం చేయాలి..
- పీఎస్‌సీడబ్ల్యూయూ రాష్ట్ర నాయకుడు జెల్లా అశోక్



**మణుగూరు, మహా :** సింగరేణిలో శాశ్వత కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (పీఎస్‌సీడబ్ల్యూయూ-టీయూసీఐ) రాష్ట్ర నాయకుడు జెల్లా అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన మణుగూరు బ్రాంచ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి అభివృద్ధిలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర కీలకమైనప్పటికీ యాజమాన్యం వారి పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. ఏళ్ల తరబడి వేతనాలు పెంచకుండా కార్మికుల శ్రమను దోచుకుంటోందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని 2016లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ సింగరేణిలో అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 30న ఇల్లందులో రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ మణుగూరు బ్రాంచ్ అధ్యక్షుడు వి జానయ్య, కార్యదర్శి పి సంజీవరెడ్డి, నాయకులు జె యాకయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఆహార భద్రత చట్టం అమలుకు పకడ్బందీ చర్యలు అదనపు కలెక్టర్ వి. రాములు

**నస్పూర్, మహా :** జిల్లాలో ఆహార భద్రత చట్టం 2006 అమలుకు అధికారుల సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. మంగళవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ చాంబర్ నుండి ఆహార భద్రతా అధికారి వాసురామ్ తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 పై నిర్వహించిన ఆన్ లైన్ శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా ఆహార భద్రత చట్టంలోని నిబంధనలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, చట్ట అమలు అంశాలపై అవగాహన కల్పించారని తెలిపారు. జిల్లాలో చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మలేరియా నివారణ చర్యలపై అధికారుల ఆకస్మిక తనిఖీ..

**ఆస్పత్రి రికార్డులను పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్**

**మణుగూరు, మహా :** మలేరియా నివారణ చర్యల్లో భాగంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో, మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ మంగళవారం అశ్వాపురం, మణుగూరు ఏరియా ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో మలేరియా కేసుల నమోదుపై ఆరా తీసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. మలేరియా వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకుని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మలేరియా వ్యాప్తికి అధిక ప్రమాదం ఉన్న వలస ఆదివాసీ గిరిజన గ్రామం రేగులగండిని సందర్శించారు. గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులు, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణకు చేపట్టిన మందు పిచికారీ పనులను పరిశీలించి వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణయ్య, రాంప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి

# ఎమ్మెల్యే రాగమయికి ఆహ్వానం

- ముద్వా విజయబాబు ఆధ్వర్యంలో 28 నుంచి సత్తుపల్లిలో రాష్ట్రస్థాయి పోటీలు
- మహిళలను చైతన్యపరచడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే మట్టా రాగమయి

**సత్తుపల్లి, అక్టోబర్ 27: మహా :** సత్తుపల్లిలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌ను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్ ముద్వా విజయబాబు ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ప్రారంభోత్సవానికి హాజరవుతానని తెలిపారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ముద్వా విజయబాబు ఆధ్వర్యంలో ముద్వా యువజన సంఘం ఈ పోటీలను నిర్వహిస్తోంది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో వేంసూరు రోడ్డులోని రాణి వేడుకల ప్రాంగణంలో పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా క్రీడాకారిణులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.

**మహిళలను చైతన్యపరచడమే ప్రభుత్వ లక్ష్యం**

మహిళలను చైతన్యపరచి, అన్ని రంగాల్లో ముందుకు నడిపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు. క్రీడారంగంలో మహిళలు రాణించేలా ప్రోత్సహించడంతోపాటు వారికి తగిన అవకాశాలు కల్పించడం అవసరమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి హాజరై క్రీడాకారిణులను ప్రోత్సహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, ముద్వా, మట్టా అభిమానులు పాల్గొన్నారు.



# నెట్‌ఫ్లిక్స్‌లో చిరంజీవి 'మెగావర్స్'



మెగాస్టార్ చిరంజీవి మరో కొత్త వేదికపై ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారనే వార్త టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతోంది. వెండితెరపై తనదైన నటన, కామెడీ టైమింగ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆయన ఇప్పుడు ఓటీటీ టాక్ షో ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువ కానున్నట్లు సమాచారం. 'మెగావర్స్' (MEGAVerse) పేరుతో నెట్‌ఫ్లిక్స్ వేదికపై ఈ కార్యక్రమం రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ షోకు సంబంధించిన చిత్రీకరణ అక్టోబర్ 27న హైదరాబాద్‌లో ప్రారంభమైనట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అయితే కార్యక్రమం విడుదల తేదీ, పూర్తి వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**తొలి ఎపిసోడ్‌లో నవ్వుల సందడి**

ఈ టాక్ షో మొదటి ఎపిసోడ్‌కు ప్రముఖ హాస్యనటులు బ్రహ్మానందం, సునీల్, సత్య అతిథులుగా హాజరుకానున్నట్లు సమాచారం. ఈ ముగ్గురు తమదైన హాస్యంతో ప్రేక్షకులను అలరించినవారే. చిరంజీవితో బ్రహ్మానందం, సునీల్‌కు ఉన్న అనుబంధం నేపథ్యంలో పాత సినిమా జ్ఞాపకాలు, షూటింగ్ అనుభవాలు, ఆసక్తికరమైన సంఘటనలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, సమకాలీన హాస్యనటుడు సత్య భాగస్వామ్యం ఈ కార్యక్రమానికి కొత్తదనాన్ని తీసుకురావచ్చని అభిమానులు భావిస్తున్నారు. ఈ కలయికతో తొలి ఎపిసోడ్ వినోదభరితంగా ఉండవచ్చనే అంచనాలు నెలకొన్నాయి.

**టాక్ షోలకు పెరుగుతున్న ఆదరణ**

తెలుగు ప్రేక్షకుల్లో సినీ తారలతో ముఖాముఖి సంభాషణలు, వారి వ్యక్తిగత అనుభవాలు తెలుసుకునే కార్యక్రమాలకు మంచి ఆదరణ ఉంది. నందమూరి బాలకృష్ణ 'అన్‌స్టాపబుల్' కార్యక్రమం ఈ తరహా షోలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ఇప్పుడు చిరంజీవి కూడా హోస్ట్‌గా కొత్త ప్రయోగం చేస్తారనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. గతంలో ఆయన 'మీలో ఎవరు కోటీశ్వరుడు' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈసారి టాక్ షో రూపంలో ప్రేక్షకులను ఎలా అలరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. చిరంజీవి సినీ ప్రయాణంలోని అనుభవాలు, సహనటులతో అనుబంధాలు, వినోదభరిత సంభాషణలు ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశం ఉంది. అయితే షో ప్రసార తేదీ, ఎపిసోడ్ల సంఖ్య, ఇతర అతిథుల వివరాలు ఇంకా అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది. మెగాస్టార్ కొత్త టాక్ షో ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# న్యూరాలింక్ కాన్సెప్ట్‌తో 'కిల్లర్'

విభిన్న కథాంశాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న తెలుగు సినిమాల్లో 'కిల్లర్' ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. దర్శకుడు పూర్వాజ్ రూపొందిస్తున్న ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? మెదడు, కంప్యూటర్ మధ్య అనుసంధానం సాధ్యమైతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? అనే ఆసక్తికరమైన ఆలోచనల చుట్టూ ఈ సినిమా కథనం సాగనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. జ్యోతి పూర్వాజ్ కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి.

**సాంకేతికతే కథకు ఆధారం**

ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన న్యూరాలింక్ సాంకేతికత ఈ చిత్రానికి ప్రధాన స్ఫూర్తిగా నిలిచింది. ఎలాన్ మస్క్‌కు చెందిన న్యూరాలింక్ సంస్థ మానవ మెదడును కంప్యూటర్లతో అనుసంధానించే సాంకేతికతపై పరిశోధనలు చేస్తోంది. ఈ ఆలోచనను కల్పిత కథాంశంతో మేళవించి ఉత్కంఠభరితమైన కథను రూపొందించినట్లు దర్శకుడు పూర్వాజ్ తెలిపారు. సాంకేతిక అభివృద్ధి వల్ల కలిగే అవకాశాలతో పాటు, దాని వెనుక దాగి ఉండే ప్రమాదాలను కూడా వినోదాత్మకంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

**విభిన్న పాత్రల్లో కథానాయిక**

ఈ సినిమాలో జ్యోతి పూర్వాజ్ భిన్నమైన పాత్రల ఛాయలతో ప్రేక్షకులను అలరించనున్నారు. కథలో చోటుచేసుకునే అనూహ్య పరిణామాలు, పాత్రల మధ్య సంబంధాలు, రహస్యాలు ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచేలా ఉండనున్నాయి. సాధారణ కథలకు భిన్నంగా కొత్త ఆలోచనతో సినిమాను తెరకెక్కించడం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

**కోటి రూపాయల బహుమతి ప్రకటన**

సినిమాలోని కీలక మలుపును ముందుగానే ఊహించి సరైన సమాధానం చెప్పిన వారికి కోటి రూపాయల బహుమతి అందిస్తామని దర్శకుడు ప్రకటించడం విశేషంగా మారింది. ఈ ప్రకటనతో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. తక్కువ వ్యవధిలో చిత్రీకరణ పూర్తి చేసిన చిత్రబృందం, విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు సమాచారం. వినూత్న కథాంశం, సాంకేతిక అంశాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో రూపొందిన 'కిల్లర్' ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



# పసుపు చీరలో రకుల్ ప్రీత్ సందడి

పండుగ వేళ సంప్రదాయ దుస్తులకు ఆధునిక అందాలను జోడిస్తూ సినీ తారలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. ఈ జాబితాలో నటి రకుల్ ప్రీత్ సింగ్ తనదైన శైలితో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమె పసుపు రంగు చీరలో మెరిసిపోతూ సంప్రదాయ అందాలకు కొత్త మెరుపులు అద్దారు. ప్రకాశవంతమైన పసుపు రంగు చీరకు రంగురంగుల ఎంబ్రాయిడరీతో రూపొందించిన బ్లౌజ్‌ను జతచేసి ప్రత్యేకంగా కనిపించారు. చీర అంచున ఉన్న గులాబీ రంగు బాంధనీ డిజైన్ మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. బంగారు రంగు జుంకాలు, చేతులకు కడాలు ధరించి సంప్రదాయ ఆభరణాల అందాన్ని తన రూపంలో ప్రతిబింబించారు. అలల మాదిరిగా కనిపించే జుట్టు, సహజమైన మేకప్ ఆమె రూపానికి మరింత నిండుదనాన్ని అందించాయి. సంప్రదాయానికి ఆధునిక మెరుగు రకుల్ ఎంచుకున్న ఈ వస్త్రధారణలో రంగుల సమన్వయం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. పసుపు రంగు చీర పండుగ వాతావరణానికి తగిన ఉత్సాహాన్ని అందిస్తుండగా, బహువర్ణాల బ్లౌజ్ ప్రత్యేకమైన రూపాన్ని తీసుకొచ్చింది. చీర అంచులోని గులాబీ రంగు డిజైన్ మొత్తం అలంకరణకు చక్కని వ్యత్యాసాన్ని జోడించింది. భారీగా కనిపించే ఆభరణాలను ఎంచుకున్నప్పటికీ, వస్త్రధారణతో అవి సమన్వయంగా ఉండేలా చూసుకున్నారు. సంప్రదాయ దుస్తులను ఇష్టపడేవారికి ఈ తరహా రంగుల కలయిక మంచి ఫ్యాషన్ ప్రేరణగా నిలుస్తుంది.పండుగ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ దీపావళి, వివాహ వేడుకలు, కుటుంబ శుభకార్యాలు వంటి సందర్భాల్లో చీరలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ముఖ్యంగా పసుపు, ఆకుపచ్చ, గులాబీ వంటి ప్రకాశవంతమైన రంగులు సంప్రదాయ వస్త్రధారణకు ఉత్సాహాన్ని జోడిస్తాయి. చీరకు సరిపోయే బ్లౌజ్, ఆభరణాలు, జుట్టు అలంకరణను ఎంచుకోవడం ద్వారా సాధారణ వస్త్రధారణకూ ప్రత్యేకమైన రూపాన్ని తీసుకురావచ్చు. రకుల్ ప్రీత్ సింగ్ తాజా లుక్ కూడా సంప్రదాయ అందాలను ఆధునిక శైలిలో ఎలా ఆవిష్కరించవచ్చో చూపిస్తోంది. సరళమైన మేకప్‌తో పాటు సరైన ఆభరణాలను ఎంచుకుంటే పండుగ వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించవచ్చనే ఫ్యాషన్ సందేశాన్ని ఆమె రూపం అందిస్తోంది.



# వెంకీతో కొత్త ప్రయోగం చేశాం

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కిన 'ఆదర్శ కుటుంబం-హౌస్ నంబర్ 47' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో వెంకటేష్ తన ప్రసంగంతో అభిమానులను ఆకట్టుకున్నారు. చాలా కాలం తర్వాత త్రివిక్రమ్‌తో కలిసి పనిచేయడం ప్రత్యేకమైన అనుభవమని ఆయన పేర్కొన్నారు. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, వినోదం మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేసింది. అక్టోబర్ 30న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

కథలో కొత్తదనం

దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రంలో తన సాధారణ శైలికి భిన్నంగా కొత్త కథనాన్ని ప్రయత్నించినట్లు వెల్లడించారు. కేవలం కుటుంబ వినోదానికే పరిమితం కాకుండా క్రైమ్, బ్లాక్ కామెడీ అంశాలను కథలో భాగం చేసినట్లు తెలిపారు. కథలోని పరిణామాలు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తాయని, చిత్రీకరణ సమయంలో తమకు కూడా కొత్త అనుభూతి కలిగిందని ఆయన వివరించారు. నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు

**రెండు దశాబ్దాల తర్వాత కలయిక**

వెంకటేష్, త్రివిక్రమ్ గతంలో కలిసి పనిచేసిన చిత్రాలు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు పొందాయి. ఈ నేపథ్యంలో మరోసారి వీరిద్దరూ కలిసి పనిచేయడం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది. వెంకటేష్ నటన, త్రివిక్రమ్ సంభాషణలు, తమన్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటించగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కుటుంబ సంబంధాల నేపథ్యంలో సాగే కథకు ఉత్కంఠభరితమైన మలుపులు జోడించడం ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. వెంకటేష్ అభిమానులతో పాటు త్రివిక్రమ్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త కథనం, హాస్యం, భావోద్వేగాలు వెండితెరపై ఏ విధంగా అలరిస్తాయో సినిమా విడుదల తర్వాత తెలియనుంది.



# బాలయ్య సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం?

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కలయికలో తెరకెక్కనున్న కొత్త సినిమాపై టాలీవుడ్‌లో ఆసక్తి పెరుగుతోంది. 'ఎన్‌బీకే 112' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా సంగీత దర్శకుడి ఎంపికపై చర్చ మొదలైంది. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందించే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

సంగీత దర్శకుడిపై ఆసక్తి బాలకృష్ణ సినిమాలకు మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే సంగీతం, శక్తివంతమైన నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. గతంలో ఆయన చిత్రాలకు ఎస్.ఎస్. తమన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సినిమాకు తమన్ లేదా అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తారనే ప్రచారం గతంలో సాగింది. ఇప్పుడు జీవీ ప్రకాష్ కుమార్ పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. అనిరుధ్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటం, సంగీత దర్శకుడి ఎంపికపై జరుగుతున్న చర్చలు ఈ మార్పునకు కారణాలుగా ప్రచారంలో ఉన్నాయి. అయితే ఈ వివరాలపై అధికారిక స్పష్టత లేదు.

**కొరటాల దర్శకత్వంలో భారీ చిత్రం**

'దేవర' తర్వాత కొరటాల శివ తెరకెక్కించనున్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు అనుగుణంగా కథ, పాత్రలను దర్శకుడు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా షూటింగ్, నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. జీవీ ప్రకాష్ కుమార్ ఈ ప్రాజెక్టులో భాగమైతే బాలకృష్ణతో ఆయనకు ఇదే తొలి సినిమా కానుంది. సంగీత దర్శకుడి ఎంపికపై అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ చిత్రంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది . ప్రస్తుతం సంగీత దర్శకుడి పేరు ప్రచారంలో ఉన్నప్పటికీ, అధికారిక ధృవీకరణ వచ్చే వరకు దీనిని ఖరారైన వార్తగా భావించలేం. బాలయ్య, కొరటాల శివ కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రం ఎలాంటి కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com